జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | గురువారం 6 ఆగస్టు 2026 | సంపుటి : 17 | సంచిక :17 | పేజీలు : 8 వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం – పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ – 1946, ఆషాఢము 17 పుర్నిమంతా – 2081, ఆషాఢము 16 అమాంత – 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

## ఎన్నో ప్రభుత్వాలు మారినా...

# పుర్సంపల్లి పాఠశాల తలరాత మాత్రం మారలేదు



శిథిలావస్థలో పాఠశాల భవనం -- భయంతోనే విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులు

చౌడాపూర్ మండల పరిధిలోని పుర్సంపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారింది.ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా,ఈ పాఠశాల దుస్థితి మాత్రం మారడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలం రావడంతో పాఠశాల పైకప్పు నుంచి వర్షపు నీరు నేరుగా తరగతి గదుల్లోకి కారుతోంది.గోడలకు భారీ పగుళ్లు ఏర్పడటంతో భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.దీంతో విద్యార్థులు ప్రతిరోజూ భయభయంతో తరగతులకు హాజరవుతుండగా,వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చదువు కోసం పంపితే.పిల్లలు సురక్షితంగా తిరిగి వస్తారా అనే ఆందోళన ప్రతి తల్లిదండ్రిని వెంటాడు తోంది.చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ పరిస్థితిని చూసి గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి పుర్సంపల్లి పాఠశాల తలరాతను మార్చి,కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించి చిన్నారులకు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని గ్రామస్తులు

## ఆరు నెలల నుండి హైదర్ నగర్ బస్తీ దవఖానాలో డాక్టరు లేరు

# రోగులు ఇబ్బంది



శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధి లోని ఐదున్నర డివిజన్ లో ఉన్న కమ్యూనిటీ హాల్ లో కొనసాగు తున్న బస్తీ దవాఖానాలో గత ఆరు నెలల నుండి రోగులకు డాక్టర్ లేక పోవడం తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నట్లు నిత్యం వచ్చే రోగు లు బుధవారం నాడు మీడియా తో వారి మనసులోని మాటలను బాధలను తెలియజేశారు. ఈ విషయమై అక్కడ ఉన్న సిబ్బంది ని డాక్టర్ రాకపోవడానికి కారణా లు ఏంటి గతంలో దివ్య అనే డాక్టర్ ఇక్కడ విధులు నిర్వహించారని తర్వాత ప్రమోషన్ కోసం కొన్ని ఉన్నత పరీక్షలను రాసేందు కు ఆమె వెళ్లింది.మళ్లీ రాకపోవడం తో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది సైతం బాలనగర్ లో నిర్వహిస్తున్న మరో డాక్టర్ పై అధికారులకు తాము లిఖితపూర్వకంగా ఇక్కడ

## ఎన్నో ప్రభుత్వాలు మారుతున్న...

# బంగారంపల్లి పాఠశాల ఇక మారదా

వర్షాల ప్రభావంతో ప్రమాదకరంగా మారిన పాఠశాల భవనం

ఒకే గదిలో ఇరుకిరుకుగా విద్యార్థులు,బయటి వరండలో బోధన





## వేగం పుంజుకున్న

# వరి సాగు



**కృష్ణా నీటి కోసం రైతుల ఎదురుచూపు .. ఇప్పటికి 30 లక్షల ఎకరాల్లో పూర్తయిన వరి సాగు**

**ఇదే ఒరవడి కొనసాగితే 50 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశం**

హైదరాబాద్

రాష్ట్రంలో ఈ ఖరీఫ్‌లో సీజన్ వరి సాగు వేగం పుంజుకుంది. గోదావరికి జలకళ సంతరించుకోవడంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ప్రాజెక్టులు, కాలువల ద్వారా సమృద్ధిగా నీరు అందుబాటులోకి వచ్చి రైతులు పెద్దఎత్తున వరి నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు కొద్ది రోజులుగా యుద్ధప్రాతిపదికన నాట్లు పూర్తి చేస్తున్నారు. వ్యవసాయశాఖ తాజా గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు నమోదైంది. అయితే గత నాలుగు రోజుల్లోనే సుమారు మూడు లక్షల ఎకరాల్లో నాట్లు వేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు అంచనా. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గోదావరి జలాలు సమృద్ధిగా అందుతుండటంతో రైతులు ఆలస్యం చేయకుండా నాట్లు పూర్తి చేస్తున్నారు. శ్రీరాంసాగర్, కాళేశ్వరం, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, లోయర్‌మానేరు, కాకతీయ కాలువల ఆయకట్టు ప్రాంతాల్లో, చెరువులు, కుంటల కింద వరి సాగు వేగంగా సాగుతోంది. వర్షాలు కూడా అనుకూలంగా ఉండటంతో పొలాల్లో నీటి కొరత లేకుండా సాగు జరుగుతోంది. మరోవైపు కృష్ణా పరీవాహక దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం వరి సాగు ఆశించిన స్థాయిలో ప్రారంభం కాలేదు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో రైతులు ఇంకా సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణా నదిలోకి నీటి ప్రవాహం పెరిగి ప్రాజెక్టుల్లోకి చేరుతున్నా, అది ఆలస్యంగా రావడంతో ప్రస్తుతం నాట్లకు పూర్తిగా అనుకూల పరిస్థితులు లేవని అధికారులు చెబుతున్నారు.

**50 లక్షల ఎకరాలకు చేరే అవకాశం**

వ్యవసాయశాఖ సాధారణ విస్తీర్ణం ప్రకారం రాష్ట్రంలో ఖరీఫ్ వరి సాగు 65.96 లక్షల ఎకరాలు. గత ఏడాది ఇదే సమయానికంటే ఈసారి నాట్లు వేగంగా సాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న వేగం మరో రెండు నుంచి మూడు వారాలు కొనసాగితే వరి సాగు 50 లక్షల ఎకరాల స్థాయిని చేరే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఆగస్టు మొదటి పక్షంలో వరి నాట్లు అత్యంత కీలక దశకు చేరనున్నాయి. ఉత్తర తెలంగాణలో ప్రస్తుతం కనిపిస్తున్న వేగం కొనసాగడంతో పాటు దక్షిణ తెలంగాణలో కూడా కృష్ణా జలాలు పూర్తిస్థాయిలో అందితే రాష్ట్రవ్యాప్తంగా వరి సాగు ఒక్కసారిగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

**పత్తిదే ఇంకా అగ్రస్థానం**

వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 92,86,726 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే రెండున్నర లక్షల ఎకరాలు అధికమే. ఇందులో అత్యధికంగా పత్తి 46,89,258 ఎకరాల్లో సాగైంది. ఆ తర్వాత వరి 29,32,884 ఎకరాలు, మొక్కజొన్న 5,01,508 ఎకరాలు, కందులు 4,68,975 ఎకరాలు, సోయాబీన్ 3,68,797 ఎకరాలు, శనగలు 74,671 ఎకరాలు, మినుములు 18,531 ఎకరాల్లో సాగయ్యాయి. మొత్తం ఆహార ధాన్యాలు 40.24 లక్షల ఎకరాలు, నూనెగింజల పంటలు 3.74 లక్షల ఎకరాలు, వాణిజ్య పంటలు 47.27 లక్షల ఎకరాల్లో నమోదయ్యాయి.

# బొల్లారం తోట ముత్యాలమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో బోనాల జాతర

.ప్రజల సుఖశాంతి, సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థించిన జంపన ప్రతాప్



**బోయిన్ పల్లి, ఆగస్టు 05.(ప్రజా జ్యోతి):** ఆషాఢ మాస బోనాల జాతర సందర్భంగా కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన బొల్లారం తోట ముత్యాలమ్మ ఆలయం భక్తజన సందోహంతో కళకళలాడింది. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు పాడి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.బోనాల జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, అమ్మవారి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభాకర్, విశ్వనాథ్, విజయ్, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ కార్యాలయంలో వైభవంగా మహంకాళి బోనాల ఉత్సవాలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్
ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం అమ్మవారిని ప్రార్థించిన ఎమ్మెల్యే
భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



**బోయిన్ పల్లి, ఆగస్టు 05.(ప్రజా జ్యోతి):** భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీ దుర్గా ఎల్లమ్మ దేవస్థానంలో మహంకాళి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు శ్యామ్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం యూనియన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మహంకాళి బోనాల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# శిశువుకు తల్లిపాలే శ్రేష్టమైనవి



**మేడ్చల్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఘన్‌పూర్ ఆధ్వర్యంలో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో పిల్లల తల్లులు, గర్భిణుల కోసం అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మెడిసిటి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. గీత మాట్లాడుతూ.. తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించి తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. సుదర్శన్ మాట్లాడుతూ.. తల్లిపాలపై ఉన్న అపోహలను నమ్మవద్దని, తల్లిబిడ్డల అనుబంధాన్ని బలోపేతం చేయడంలో తల్లిపాల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. శ్రీకాంత్ మాట్లాడుతూ.. తల్లిపాలకు డబ్బా పాలు, ఆవు లేదా గేదె పాలు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. అనంతరం మెడిసిటి పీజీ విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణపై ప్రత్యేక స్కిట్ ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు, గర్భిణులు తల్లిపాల వల్ల శిశువుకు కలిగే ప్రయోజనాలపై విలువైన సమాచారం తెలుసుకున్నామని తెలిపారు. అనంతరం వారికి పండ్లతో పాటు వేరుశనగ చిక్కీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా. ఈనాక్షి గంగూలి, డా. సమీర్, డా. నాగరాజు, వైద్యులు, పీజీ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# దశదిన కర్మల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు దండెం రాంరెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 5 (ప్రజాజ్యోతి)** పెద్ద అంబర్‌పేట్ గ్రామానికి చెందిన కీ.శే. పసుల సత్యమ్మ ముదిరాజ్ దశదిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ దండెం రాంరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా దివంగతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు.అనంతరం తొర్రూరు డివిజన్ పరిధిలోని కోహెడ గ్రామానికి చెందిన కీ.శే. సానెం నరసింహ గౌడ్ దశదిన కర్మ కార్యక్రమంలో కూడా దండెం రాంరెడ్డి పాల్గొన్నారు. దివంగతుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని

# సిపిఐ ప్రచార యాత్రలను జయప్రదం చేయండి.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 5(ప్రజా జ్యోతి )** కేంద్రంలో బిజెపి అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న దేశ రాజధాని ఢిల్లీలో లక్షలాదిమందితో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 6 నుండి 14 వరకు జరిగే ప్రచార యాత్రలను జయప్రదం చేయాలని కోరుతూ నేడు షాపూర్ నగర్ హమాలి అడ్డ వద్ద ప్రచార యాత్ర గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది.
ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కె స్వామి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలు తగ్గించడంలో విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల అన్ని నిత్యవసర వస్తువులు ధరలు పెరిగాయని, విద్య వ్యవస్థను మొత్తం భ్రష్టు పట్టించిందని, యువజన కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని వీటన్నిటి ఫలితమే నేడు ప్రజలు పోరాటాలకు సిద్ధమై ఉన్నారని ఆ పోరాటాలకు నాయకత్వం వహించడానికి కమ్యూనిస్టు పార్టీ సిద్ధమైందని అన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటినుండి బిజెపి ప్రభుత్వం ఏర్పడే వరకు 46 లక్షల కోట్లు అప్పుయితే బిజెపి వచ్చి 12 ఏళ్ల కాలంలోనే లక్ష కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. అప్పు చేయడమే కాకుండా ధరలను పెంచి టాక్స్ ల పేరుతో ప్రజల నుంచి లక్షల కోట్లను వసూలు చేసిందని, ఇన్ని లక్షల కోట్లతో ఎలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్మించకపోగా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను తన మిత్రుడైన ఆదానికి మోడీ అమ్మివేశాడని దీనివల్లే నేడు అన్ని రంగాలలో ప్రభుత్వం విఫలమై ప్రజల తిరుగుబాటుకు కారణం అవుతుందని అన్నారు. ఇలా మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తూ సెప్టెంబర్ ఒకటి నాడు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ కార్యక్రమాలు జయప్రదం చేయడానికి సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని కావున ప్రజలందరూ ప్రచార యాత్రలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, ఏఐటి యు సి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు సుంకిరెడ్డి మల్లేష్ మహేందర్ మజ్జి గౌరీ పవన్ చంద్రయ్య రమేష్ బాలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపాలనేది లక్ష్యం

మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి
సొంత నిధులతో మల్లాపూర్ ఎస్సీ వాడలో ఐమాక్స్ లైట్స్ ప్రారంభించిన మాజీ ఎంపీపీ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి
మండలంలోని పలు గ్రామాలకు సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తా



**కొత్తూర్ ఆగస్టు 05 (ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపాలనేది లక్ష్యం అని మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు.కొత్తూరు మండలంలోని మల్లాపూర్ ఎస్సీ వాడలో ఐమాక్స్ లైట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్తూరు మండలంలోని పలు గ్రామాలకు సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి, మీనాక్షి దశరథ్ నాయక్,ఉప సర్పంచ్ లు రాములు గౌడ్,శంకర్ నాయక్,మాజీ సర్పంచ్ రవి నాయక్,కాట్న రాజు, వార్డు సభ్యులు పవిత్ర జయందర్ రెడ్డి,స్వాతి రాజేష్, జార్జి రెడ్డి,మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ చిర్ర రాజు,చిర్ర సుధాకర్,చిర్ర దర్శన్,మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్,పెండ్లిమడుగు రాజు, కృష్ణ,శ్రీను,చిర్ర దర్శన్,మోహన్ నాయక్,దర్శన్,కృష్ణ,అనిల్, వంశీ,శ్రీను,శ్రీశైలం,జంగయ్య, శేఖర్ రెడ్డి,దయానంద రెడ్డి, భరత్ రెడ్డి,దామోదర్ రెడ్డి, పాపిరెడ్డి,భాను,పవన్, శ్రీను,రఘు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడే

పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు పట్టించుకోని అధికారులు
గాడి తప్పిన స్వచ్ఛత.. కంపుకొడుతున్న కాలనీలు
డంపింగ్ యార్డుల్లా మారుతున్న వైనం
దోమలు,ఈగలు స్వైరవిహారం అనారోగ్యం బారిన కాలనీ ప్రజలు




**కొత్తూర్ ఆగస్టు 05 (ప్రజా జ్యోతి)** కొత్తూరు మున్సిపాలిటీలో స్వచ్ఛత గాడి తప్పింది.. ఎక్కడ చూసినా..చెత్త కుప్పలే దర్శమిస్తున్నాయి..పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీలు డంపింగ్ యార్డులను తలపిస్తూ..కంపుకొడుతున్నాయి. దుర్వాసన,రోగాలతో జనం అవస్థలుపడుతున్నారు.ఎన్ని స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినా.. కాగితాల్లో ఎన్ని జీవీపీ పాయింట్లు ఎత్తివేసినట్లు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఎకడ వేసిన గొంగలి అకడే అన్నట్లు ఉంది. చెత్తశుద్ధిలో చిత్తశుద్ధి కరువుతున్నది.ఫలితంగా కొత్తూరు మున్సిపాలిటీలో రోగాలు విజృంభిస్తున్నాయి. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ కాలనీలో గత వారం రోజుల నుండి చెత్త వెహికల్స్ రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎక్కడ చెత్త అక్కడే ఉండడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు.వెంటనే మున్సిపల్ కమిషనర్ గారు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్ లో డ్రైనేజీ పొంగిపొర్లుతున్న పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# టీజేఎంయూ నాయకుల పరిచయ, సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**షాద్‌నగర్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి ):** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో తెలంగాణ జేఏసీ మోటార్ యూనియన్ (టీజేఎంయూ) ఆధ్వర్యంలో నాయకుల పరిచయ, పరస్పర సన్మాన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. టీజేఎంయూ గౌరవాధ్యక్షుడు దంగు శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, డిపో సెక్రటరీ ఎస్.ఎస్. రావు, అధ్యక్షుడు నరసింహ, గ్యారేజ్ సెక్రటరీ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సైదుపల్లి మహేందర్ గౌడ్, మహిళా నాయకురాళ్లు కళ్యాణి, జ్యోతి, రాష్ట్ర నాయకులు స్వాములయ్య, రాజన్న, అప్పారెడ్డి, వెంకటన్న తదితరులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పరిచయం చేశారు.అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో నాయకులు ఒకరినొకరు శాలువాలతో సన్మానించుకుని సంఘీభావాన్ని చాటుకున్నారు. యూనియన్ బలోపేతం, కార్మికుల సంక్షేమం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీజేఎంయూ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు టీజేఎంయూ గౌరవాధ్యక్షుడు దంగు శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# భౌరంపేట్ అభివృద్ధిపై ఎమ్మెల్యే కె.పి. వివేకానంద దృష్టి -- ప్రజా సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్ ఆగస్టు 5(ప్రజా జ్యోతి ) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ గ్రామంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి స్థానిక ప్రజలు, నాయకులు, గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు, సరిగా లేకపోయిన డ్రైనేజీ వ్యవస్థ, రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులతో చర్చించి, వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్ల మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ కాలనీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# "భావన డయా బెస్ట్ రైస్" కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్ 5 (ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 125వ డివిజన్ గాజులరామారం, మల్లారెడ్డి నగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన "భావన డయా బెస్ట్ రైస్" కేంద్రాన్ని బుధవారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి యాంత్రిక జీవనశైలిలో మధుమేహం సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. మధుమేహ నియంత్రణకు అనుకూలంగా రూపొందించిన డయా బెస్ట్ రైస్ ఆరోగ్య పరిరక్షణలో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భావన డయా బెస్ట్ రైస్ చైర్మన్ సుధీర్, నిర్వాహకులు ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, పాక్స్ చైర్మన్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, కరుణాకర్ రాజు, సమ్మయ్య యాదవ్, రాములు గౌడ్, తెలంగాణ సాయి, శివనాయక్, శశిధర్, మధు తదితరులు పాల్గొన్నారు.


# "భావన డయా బెస్ట్ రైస్" కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేవివేకానంద్





**కుత్బుల్లాపూర్ 5 (ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 125వ డివిజన్ గాజులరామారం, మల్లారెడ్డి నగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన "భావన డయా బెస్ట్ రైస్" కేంద్రాన్ని బుధవారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి యాంత్రిక జీవనశైలిలో మధుమేహం సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. మధుమేహ నియంత్రణకు అనుకూలంగా రూపొందించిన డయా బెస్ట్ రైస్ ఆరోగ్య పరిరక్షణలో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భావన డయా బెస్ట్ రైస్ చైర్మన్ సుధీర్, నిర్వాహకులు ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, పాక్స్ చైర్మన్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, కరుణాకర్ రాజు, సమ్మయ్య యాదవ్, రాములు గౌడ్, తెలంగాణ సాయి, శివనాయక్, శశిధర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన బిడ్డకు పునాది తల్లిపాలే

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం



**షాద్ నగర్ , ఆగస్టు 05(ప్రజాజ్యోతి ):** తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, ఆరోగ్యవంతమైన బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే బలమైన పునాదని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఫరూక్ నగర్ మండలపరిధిలోని చించోడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏరియా సబ్‌సెంటర్--'ఎ' అర్బన్ 2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్ పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు లేదా ఇతర ఆహారం అవసరం లేదని సూచించారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు అమృతంతో సమానమని, అవి రోగనిరోధక శక్తిని పెంచి విరేచనాలు, నిమోనియా వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయని చెప్పారు.తల్లిపాలు శిశువు శారీరక, మానసిక వికాసానికి దోహదపడటమే కాకుండా తల్లి--బిడ్డల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం తల్లి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రొమ్ము, అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, గుడ్లు, ఇతర పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, ఆరోగ్య సిబ్బంది అందించే ఐరన్ మాత్రలను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. శిశువుకు పాలిచ్చిన అనంతరం బిడ్డను భుజంపై పెట్టి వీపు తట్టాలని తల్లులకు సూచించారు. కార్యక్రమం అనంతరం అక్కడికి వచ్చిన చిన్నారికి హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు బాలామృతం తినిపించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సంధ్య, 19వ వార్డు కౌన్సిలర్ ఆరిఫా బేగం, 20వ వార్డు కౌన్సిలర్ పి. గోపాల్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, కవిత, రాధాదేవి, జయమ్మ, శ్రీదేవి, ఏఎన్ఎమ్ ఇస్తే రాణి, అంగన్‌వాడీ ఆయా కళావతి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# ఉత్తమ జీవనానికి ఉమ్మడి కుటుంబాలే బలమైన పునాది



**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 05 (ప్రజాజ్యోతి)** నేటి సమాజంలో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఉమ్మడి కుటుంబాల విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షులు భావన శ్రీనివాస్ అన్నారు. వనస్థలిపురంలోని నారాయణ పాఠశాల బ్రాంచ్ లో ప్రిన్సిపాల్ శ్రీమతి భవాని ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఉమ్మడి కుటుంబాల్లో పెరిగే పిల్లలకు ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, పెద్దల పట్ల మర్యాద, బాధ్యతాయుతమైన జీవన విధానం సహజంగా అలవడతాయని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య ఐక్యత, సహకారం, త్యాగం వంటి విలువలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలో చిన్న కుటుంబాల వల్ల పిల్లలు ఒంటరితనానికి గురయ్యే అవకాశాలు పెరుగుతున్నాయని, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మానసిక ప్రశాంతతతో పాటు సామాజిక బంధాలను మరింత బలపరుస్తుందని వివరించారు. విద్యార్థులు పెద్దలను గౌరవిస్తూ కుటుంబ విలువలను కాపాడాలని, సమాజాభివృద్ధికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటుగా ఆటపాటల్లో ప్రమేయం కల్పించడమే కాకుండా కుటుంబ విలువల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు నారాయణ పాఠశాల యాజమాన్యం ఇలాంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం హేమంబర్, ఆర్ ఐ ప్రసాద్ లు మాట్లాడుతూ నేటి సమాజంలో పెద్దలపట్ల నిర్లక్ష్య భావం ప్రబలిపోయిందని కుటుంబాలకు ఆలంబన నిచ్చే తాతయ్యలు నాయనమ్మలు అమ్మమ్మలను ఆప్యాయంగా పలకరించే వాళ్లతో కలిసి ఉండే అవకాశాలను పిల్లలు పోగొట్టుకోవద్దని, వాళ్ల అనుభవం ఆప్యాయతలు భావి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని అందువల్ల ఉమ్మడి కుటుంబాల దిశగా మన సమాజం మళ్లీ అడుగు వేయాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.పాఠశాల యాజమాన్యం భావన శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికి, విద్యార్థుల్లో కుటుంబ విలువలపై చైతన్యం కలిగించేలా చేసిన ప్రసంగం ఎంతో ప్రేరణాత్మకంగా నిలిచిందని అభినందించింది. ప్రముఖ వాగ్గేయకారులు రమణయ్య ఆలపించిన గీతాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం సభ్యులు వేమారెడ్డి, పాఠశాల డీన్ లు రామలింగం, శ్రీదేవి, కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతో సైబర్ నేరాలను అడ్డుకుందాం

## చేవెళ్ల సీఐ కట్టా నరేందర్ రెడ్డి

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




**చేవెళ్ల ఆగస్టు 05(ప్రజా జ్యోతి):** డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల సీఐ కట్టా నరేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ కట్టా నరేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని, నకిలీ పెట్టుబడి పథకాలు, డిజిటల్ అరెస్ట్, ఫిషింగ్ లింకులు, లోన్ యాప్‌లు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, ఓటిపి- యూపీఐ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటిపి- యూపీఐ పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం తెలియని యాప్ లను డౌన్లోడ్ చేయడం ఆసాధారణంగా అధిక లాభాలు వస్తాయని చెప్పి ఆన్లైన్ పెట్టుబడులను నమ్మడం ప్రమాదకరమని వివరించారు.ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, అనుమానాస్పద లింకులు, వీడియో కాల్స్, నకిలీ వెబ్‌సైట్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.

# కేఎల్‌హెచ్‌లో ఏఐ ఆధారిత డిజిటల్ మార్కెటింగ్‌పై అధ్యాపకుల శిక్షణ

**హైదరాబాద్, ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి) :** కేఎల్‌హెచ్ బాచుపల్లి బీబీఏ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ – అటల్ ప్రాయోజిత ఆరు రోజుల అధ్యాపకుల అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఆగస్టు 3 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్లు కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ డీన్ డా.ఆనంద్ బెతపూడి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ మార్కెటింగ్‌లో కృత్రిమ మేధస్సు, అధునాతన విశ్లేషణలపై అధ్యాపకులు, పరిశోధకులకు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా హౌసింగ్.కామ్ సీనియర్ ఏరియా హెడ్ నరసింగ్ పత్రో హాజరైనట్లు తెలిపారు. నిఖిల్ కురుగంటి(అన్‌బ్లిక్స్), శశి వంగా(వన్‌కోర్‌హబ్, ఏఐ నెక్సీలి), లోకేష్ అరుకల(గ్రోఎక్స్ డిజిటల్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్), అశోక్ కుమార్(డిజి మేధా) వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌హెచ్ బాచుపల్లి ప్రిన్సిపల్



డా.ఎల్.కోటేశ్వరరావు, డా.బి.శరత్ సింహ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో జుట్టు సంరక్షణకు ఆరోగ్యకరమైన అలవాట్లు కీలకం

**హైదరాబాద్, ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి) :** వర్షాకాలంలో తేమ, చెమట, వర్షంలో తడవడం వల్ల జుట్టు పొంగిపోవడం, చుండ్రు, దురద వంటి సమస్యలు పెరుగుతాయని సౌందర్య చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ గీతికా మిట్టల్ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైసన్ ఇంజినీర్, ప్రిన్సిపల్ హెయిర్ సైంటిస్ట్ రాబ్ స్మిత్ తోకలసి ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జుట్టుకు తల చర్మం(స్కాల్ప్) ఆరోగ్యమే పునాది అని అన్నారు. తల చర్మాన్ని క్రమం తప్పకుండా శుభ్రంగా ఉంచడం, తడి జుట్టుతో నిద్రపోకపోవడం, పూర్తిగా ఆరిన తర్వాతే కట్టుకోవడం వంటి అలవాట్లు అవసరని అన్నారు. గాలిలో తేమ వల్ల జుట్టు స్వభావం మారి హెయిర్ స్టైల్ ఎక్కువసేపు నిలవదని తెలిపారు. అధిక వేడి వినియోగించకుండా జుట్టును సరిగా ఆరబెట్టడం, డైసన్ బ్యూటీ ఉత్పత్తుల్లోని ఇంటెలిజెంట్ హీట్ కంట్రోల్, హై-స్పీడ్ ఎయిర్‌ఫ్లో సాంకేతికతలు ఆరోగ్యకరమైన జుట్టు సంరక్షణకు తోడ్పడతాయని చెప్పారు. సరైన జుట్టు సంరక్షణ అలవాట్లను పాటించాలని సూచించారు.

# ఘనంగా ప్రొ.ఇటికల పురుషోత్తం జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ.ఇటికల పురుషోత్తం జన్మదినోత్సవాన్ని బుధవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, ఓయూ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ డా.అక్తర్ అలీ, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవితేజ, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇట్ట ఉదయశ్రీతో పాటు మేధావులు, వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థినీలు పాల్గొని ప్రొ.పురుషోత్తంను శాలువా, పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కొడిచెర్లలో పంపుల వెంకటయ్య దశదిన కార్యక్రమం.

## నివాళులర్పించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ.




**కొత్తూర్ ఆగస్టు 05 (ప్రజా జ్యోతి )** మండలంలోని కొడిచెర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పంపులు నరసింహ గౌడ్ తండ్రిగారైన పంపుల వెంకటయ్య గౌడ్ దశదిన కార్యక్రమాన్ని బుధవారం వారి కుటుంబ సభ్యులు సగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో దయ్యాల శ్రీనివాస్, గూడూరు శ్రీనివాస్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

# పేదల సొంతింటి కలే ప్రభుత్వ లక్ష్యం

## మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి

## దామరగిద్ద 9వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం





**చేవెళ్ల ఆగస్టు 05(ప్రజా జ్యోతి):** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద 9వ వార్డులో బేగరి కవిత--రాజు దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని బుధవారం స్థానిక కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ...పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాము గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, దామరగిద్ద మాజీ సర్పంచులు వెంకటేశం గుప్తా, మధుసూదన్ గుప్తా, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, దొడ్డి సత్తయ్య, దొడ్డి మల్లేష్, బేగరి ప్రభాకర్, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ విలువల పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి

## వనస్థలిపురం బ్రాంచ్ నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ భవాని



**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 05 (ప్రజాజ్యోతి)** నేటి సమాజంలో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఉమ్మడి కుటుంబాల విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షులు భావన శ్రీనివాస్ అన్నారు. వనస్థలిపురంలోని నారాయణ పాఠశాల బ్రాంచ్ లో ప్రిన్సిపాల్ శ్రీమతి భవాని ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఉమ్మడి కుటుంబాల్లో పెరిగే పిల్లలకు ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, పెద్దల పట్ల మర్యాద, బాధ్యతాయుతమైన జీవన విధానం సహజంగా అలవడతాయని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య ఐక్యత, సహకారం, త్యాగం వంటి విలువలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలో చిన్న కుటుంబాల వల్ల పిల్లలు ఒంటరితనానికి గురయ్యే అవకాశాలు పెరుగుతున్నాయని, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మానసిక ప్రశాంతతతో పాటు సామాజిక బంధాలను మరింత బలపరుస్తుందని వివరించారు. విద్యార్థులు పెద్దలను గౌరవిస్తూ కుటుంబ విలువలను కాపాడాలని, సమాజాభివృద్ధికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటుగా ఆటపాటల్లో ప్రమేయం కల్పించడమే కాకుండా కుటుంబ విలువల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు నారాయణ పాఠశాల యాజమాన్యం ఇలాంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం వనస్థలిపురం బ్రాంచ్ నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ భవాని మాట్లాడుతూ నేటి సమాజంలో పెద్దలపట్ల నిర్లక్ష్య భావం ప్రబలిపోయిందని కుటుంబాలకు ఆలంబన నిచ్చే తాతయ్యలు నాయనమ్మలు అమ్మమ్మలను ఆప్యాయంగా పలకరించే వాళ్లతో కలిసి ఉండే అవకాశాలను పిల్లలు పోగొట్టుకోవద్దని, వాళ్ల అనుభవం ఆప్యాయతలు భావి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని అందువల్ల ఉమ్మడి కుటుంబాల దిశగా మన సమాజం మళ్లీ అడుగు వేయాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. పాఠశాల యాజమాన్యం భావన శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికి, విద్యార్థుల్లో కుటుంబ విలువలపై చైతన్యం కలిగించేలా చేసిన ప్రసంగం ఎంతో ప్రేరణాత్మకంగా నిలిచిందని అభినందించింది. ప్రముఖ వాగ్గేయకారులు రమణయ్య ఆలపించిన గీతాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం హేమంబర్, ఆర్ ఐ ప్రసాద్,జాగృతి అభ్యుదయ సంఘం సభ్యులు వేమారెడ్డి, పాఠశాల డీన్ లు రామలింగం, శ్రీదేవి, కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్‌కు బలమైన ఆరంభం

## మొదటి త్రైమాసికంలో 20% ఆదాయ వృద్ధి ఆపరేటింగ్ ఈబిట్డా 30% పెరుగుదల



**శేరిలింగంపల్లి,ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** దేశంలోని ప్రముఖ సమగ్ర ఆరోగ్య సేవల సంస్థ ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ సంయుక్త ప్రోఫార్మా ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20 శాతం పెరిగి రూ.2,597 కోట్లకు చేరగా, ఆపరేటింగ్ ఈబిట్డా 30 శాతం పెరిగి రూ.576 కోట్లకు చేరింది. ఈబిట్డా మార్జిన్ 22.2 శాతానికి చేరి 170 బేసిస్ పాయింట్లు మెరుగుపడింది.జూలై 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్-క్వాలిటీ కేర్ విలీనంతో దేశంలోని అతిపెద్ద ఆస్పత్రుల నెట్‌వర్క్‌లలో ఒకటిగా సంస్థ అవతరించిందని కంపెనీ తెలిపింది.ప్రస్తుతం 28 నగరాల్లో 10,800కు పైగా పడకలతో సేవలు అందిస్తున్న ఈ సంస్థ, రాబోయే సంవత్సరాల్లో 15 వేలకుపైగా పడకలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఆజాద్ మూపెన్ మాట్లాడుతూ... ఈ విలీనం సంస్థ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, పరిశోధనలతో అత్యుత్తమ వైద్య సేవలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ & గ్రూప్ సీఈఓ వరుణ్ ఖన్నా మాట్లాడుతూ... తొలి త్రైమాసికంలో సంస్థ దాదాపు 20 లక్షల మంది రోగులకు వైద్య సేవలు అందించిందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 13 శాతం అధికం అని చెప్పారు. విలీనం ద్వారా ఏర్పడిన సమగ్ర వ్యవస్థను మరింత బలోపేతం చేసి, రోగి సేవలు, సాంకేతిక వినియోగం, ఆస్పత్రుల నిర్వహణలో మెరుగైన ఫలితాలపై దృష్టి సారిస్తామని తెలిపారు.ఈ త్రైమాసికంలో సంస్థ రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయిడ్ (రాజు) 22.9 శాతానికి పెరిగి 246 బేసిస్ పాయింట్లు మెరుగుపడింది. అలాగే కాసరగోడ్ ఆస్పత్రి ప్రారంభమైన తొమ్మిది నెలల్లోనే నెలవారీ ఈబిట్డా బ్రేక్‌ఈవెన్ సాధించడం విశేషంగా నిలిచింది.విలీనానికి ముందు సంస్థల పనితీరును పరిశీలిస్తే, ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ ఆదాయం 22 శాతం పెరిగి రూ.1,311 కోట్లకు, క్వాలిటీ కేర్ ఆదాయం 19 శాతం పెరిగి రూ.1,287 కోట్లకు చేరాయి.రెండు సంస్థలు కూడా ఆదాయం, లాభదాయకత,రోగుల సంఖ్యలో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి.

# ఆరు నెలల నుండి హైదర్ నగర్ బస్తీ దవఖానాలో డాక్టరు లేరు రోగులు ఇబ్బంది

## బస్తీ దవాఖాన ...సిబ్బందితో కొనసాగిస్తున్న వైనం లబోదిబోమ్మంటున్న రోగులు





**శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధి లోని ఐదున్నర డివిజన్ లో ఉన్న కమ్యూనిటీ హాల్ లో కొనసాగు తున్న బస్తీ దవాఖానాలో గత ఆరు నెలల నుండి రోగులకు డాక్టర్ లేక పోవడం తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నట్లు నిత్యం వచ్చే రోగు లు బుధవారం నాడు మీడియా తో వారి మనసులోని మాటలను బాధలను తెలియజేశారు. ఈ విషయమై అక్కడ ఉన్న సిబ్బంది ని డాక్టర్ రాకపోవడానికి కారణా లు ఏంటి గతంలో దివ్య అనే డాక్టర్ ఇక్కడ విధులు నిర్వహించారని తర్వాత ప్రమోషన్ కోసం కొన్ని ఉన్నత పరీక్షలను రాసేందు కు ఆమె వెళ్లింది. మళ్లీ రాకపోవడం తో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది సైతం బాలనగర్ లో నిర్వహిస్తున్న మరో డాక్టర్ పై అధికారులకు తా ము లిఖితపూర్వకంగా ఇక్కడ డాక్టర్ని ఏర్పాటు చేయాలని పంపించినట్లు సిబ్బంది పేర్కొన్నా రు. హైదర్నగర్ గ్రామం అంటేనే ఆనాటి నుండి నేటి వరకు పెద్ద మా ర్పు లేదు చదువుకున్న వాళ్ళ సంఖ్య చాలా తక్కువ నిరక్షరాశు లు ఎక్కువగా అనిపిస్తుంటారు. ఇలాంటి వారి కోసం నియోజకవ ర్గంలోని బస్సు దవాఖా నాలలో డాక్టర్లు ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం గత మార్చ్ నుండి ఆగస్టు 2026 ఆగస్టు 5వ తేదీ వరకు కూడా ఎటువంటి డాక్టర్ని నియమించక పోవడం బాధాకరమని చెప్పాలి. ప్ర తిని త్యం పలు రోగాల బారిన పడుతున్న స్థానిక జనాలు నిత్యం బస్సు డాక్టర్ లేదు అనడంతో ఏం చేయాలో తోచని పరిస్థితిలో నర్సు ల ద్వారా కొన్ని మందులను తీసు కుంటూ వెళ్ళిపోతూ ఇబ్బం దుల పాలో అవుతున్నట్లు వారు మీడి యా సోదరులకు తెలియజేశారు. ఈ విషయం లో బాలానగర్ లో పనిచేస్తున్న డాక్టర్ ఇన్చార్జి మేము సైతం పై అధికారులకు త్వరలోనే డాక్టర్ నగర్ పంపాలని సిఫా రసు చేసినట్లు ఆమె తెలియజేశారు. ఇ ప్పటికైనా వందలాది మంది నిత్యం హాస్పిటల్కు వచ్చే రోగులను దృష్టి లో ఉంచుకొని సంబంధిత అధికా రులు స్థానిక ఎమ్మెల్యే మాజీ కా ర్పొరేటర్ ఈ విషయంలో తక్షణమే నిర్ణయం తీసుకొని హైదర్ నగర్ బక్రీద్వానకు డాక్టర్ అపార్మెంట్ ను వెంటనే చేయ వలసిందిగా ఈ ప్రాంతంలోని నివాసితులతోపాటు పరిసర ప్రాంతాల్లోని పలువురు రోగులు కోరుతున్నారు.

# ప్రజలకు చేరువగా పోలీసింగ్ ఉండాలి

ఫ్యూచర్ సిటీ సీపీ డా. తరుణ్ జోషి

చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ సీపీ







**చేవెళ్ల, ఆగస్టు 5 (న్యూస్):** ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. శ్రీ తరుణ్ జోషి, ఐపీఎస్ సూచించారు. బుధవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ భవనం, పరిసరాల పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, అధికారిక రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, పురుషుల బారక్‌ను ప్రారంభించారు. ప్రతి పోలీసు అధికారి విధి నిర్వహణతో పాటు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. సందర్భంగా సిపి మాట్లాడుతూ.. చట్టాలపై, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన, యూఐ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య వ్యవస్థలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు. సైబర్ నేరాల నివారణ, గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. తనిఖీలో డీసీపీ యోగేష్ గౌతమ్, ఏసీపీ బి. కిషన్, ఎస్‌హెచ్‌ఓ కె. నరేందర్ రెడ్డి ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ?100 కోట్ల భద్రతా నిబద్ధతను ప్రకటించిన ఏఐ ప్లస్ స్మార్ట్ ఫోన్




**హైదరాబాద్:** భారతీయ స్మార్ట్‌ఫోన్ రంగంలో ఒక కీలక ముందడుగుగా, ఏఐ ప్లస్ స్మార్ట్ ఫోన్ దీర్ఘకాలిక సమాజ భాగస్వామ్యంతో దేశంలోనే అత్యంత సురక్షితమైన స్మార్ట్‌ఫోన్ ఎకోసిస్టమ్‌ను నిర్మించేందుకు ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్ ను ప్రారంభించింది. సంస్థ వచ్చే ఐదు సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం ?20 కోట్లు, మొత్తం ?100 కోట్లు కేటాయిస్తూ, సాంకేతిక మరియు డెవలపర్ సమాజాన్ని భద్రతను మరింత బలోపేతం చేయడానికి మరియు తన పరికరాలపై విశ్వాసాన్ని పెంపొందించడానికి ఆహ్వానిస్తోంది. ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్ భద్రత అనేది అంతిమ గమ్యం కాదని, అది నిరంతర ప్రయాణమని విశ్వసిస్తుంది. డిజిటల్ ప్రపంచం మరింత అనుసంధానమవుతున్న నేపథ్యంలో, సురక్షితమైన స్మార్ట్‌ఫోన్ల నిర్మాణానికి సహకారం, పారదర్శకత మరియు సమాజం యొక్క చురుకైన భాగస్వామ్యం అవసరమని ఏఐ ప్లస్ పేర్కొంటోంది. ఈ కార్యక్రమం సంప్రదాయ బగ్ బౌంటీ కార్యక్రమాలను మించి, డెవలపర్లు, భద్రతా పరిశోధకులు మరియు నైతిక హ్యాకర్లు కలిసి ఏఐ ప్లస్ ఉత్పత్తుల భద్రత మరియు స్థిరత్వాన్ని బలోపేతం చేసే ఓపెన్ వాతావరణాన్ని సృష్టించడానికి ఉద్దేశించబడింది.

# మద్రసా-ఏ-దీనియత్ పరిసర ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

. స్థానికుల ప్రశంసలు అందుకున్న నదీమ్ పటేల్



**బోయిన్ పల్లి, ఆగస్టు 05.(ప్రజా జ్యోతి):** ఓల్డ్ బోయిన్‌పల్లి 262వ డివిజన్ పరిధిలోని మద్రసా-ఏ-దీనియత్ సమీప ప్రాంతంలో గత కొంతకాలంగా తాగునీటి సరఫరా తక్కువ ఒత్తిడితో (లో ప్రెషర్) రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించకపోవడంతో స్థానికులు నదీమ్ పటేల్ను ఆశ్రయించారు.స్థానికుల సమస్యను వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ఆదేశాల మేరకు నదీమ్ పటేల్ చొరవ తీసుకుని,హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.అధికారుల సహకారంతో అవసరమైన సాంకేతిక పనులు పూర్తి చేయడంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరా సాధారణ స్థితికి చేరుకుంది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా స్థానికులు స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్, చొరవ చూపిన నదీమ్ పటేల్, అలాగే సహకరించిన వాటర్ వర్క్స్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో బోనాల పండుగ నిర్వహించాలి

. పోలీసులకు సహకరించాలి -- బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తి




**బోయినపల్లి, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):** రానున్న బోనాల మహోత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వహించుకోవాలని బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. పండుగ సందర్భంగా భక్తులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు అధ్యక్షతన బోనాల పండుగ నిర్వహకులు, పీస్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోనాల పండుగను పురస్కరించుకుని అన్ని ఆలయాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని, ఆలయాల పరిసర ప్రాంతాల్లో షీ టీమ్స్ నిరంతరం గస్తీ నిర్వహిస్తాయని తెలిపారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు మాట్లాడుతూ, ఫలహారపు బండ్లు, అమ్మవార్లకు తొట్టెల సమర్పించే నిర్వాహకులు ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్ల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. పండుగ సందర్భంగా బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు వంటి విలువైన వస్తువుల పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐలు శివశంకర్, జి. రామకృష్ణ, ఆర్. రామకృష్ణ, పాండు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు, పీస్ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయి పరిహారమిచ్చి రైతులని ఆదుకోవాలి

డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవోకు వినతి అందజేత

127 సర్వేనెంబర్ రీ సర్వే చేయాలన్న డిప్యూటీ కలెక్టర్

సర్పంచ్ కొలను రమాదేవి ఆధ్వర్యంలో వినతి



**యాచారం, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** మొండి గౌరెల్లి సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం, రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టరేట్లో డిప్యూటీ కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డీవో కార్యాలయంలో శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన సమావేశానికి హాజరై సర్పంచ్ ఆధ్వర్యంలో వినతి అందజేశారు. ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లు 19, 68, 127లలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం సేకరిస్తున్న భూములకు రూ. 30 లక్షలు, ప్లాటు, ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మరో ప్లాటు ఇస్తామని చెప్పడంతో భూముల సర్వేకు అనుమతించామని చెప్పారు. 127 సర్వే నెంబర్ లో చేపట్టిన సర్వే తప్పుల తడకగా ఉందని ధర్నా చేపట్టడంతో ఆర్డిఓ కలెక్టర్ తో సమావేశం ఏర్పాటు చేయిస్తామన్న హామీతో ధర్నాను విరమించామని చెప్పారు. దాదాపు 18 మంది రైతులకు రికార్డులో ఉన్న భూమి కంటే తక్కువగా చూపారని రికార్డు ప్రకారం కబ్జాలో ఉన్నవారికి పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి రైతుల్ని ఆదుకోవాలని విన్నవించారు. డిప్యూటీ కలెక్టర్ వెంటనే 127 సర్వే నెంబర్ రీ సర్వే చేయాలని మరో పర్యాయం సమావేశం ఏర్పాటు విషయాన్ని వెల్లడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసిల్దార్ అయ్యప్ప, ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# దూలపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో భారీ షెడ్ నిర్మాణం.. పట్టించుకోని అధికారులు



**కొంపల్లి, ఆగస్టు 5 ప్రజా జ్యోతి** దూలపల్లి డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో నిర్మిస్తున్న భారీ షెడ్ స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. కాలనీ మధ్యలో భారీ నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, షెడ్ నిర్మాణం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు భవిష్యత్తులో భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో జరుగుతున్న నిర్మాణం చట్టబద్ధమైనదేనా? అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి, అక్రమ నిర్మాణమైతే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సమస్య మరింత తీవ్రమయ్యేలోపు సంబంధిత శాఖలు స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# అమ్మవారి దయతో పంటలు బాగా పండాలి

మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్

తిమ్మాపూర్‌లో ఘనంగా పోచమ్మ--మైసమ్మ బోనాల మహోత్సవం



**కొత్తూర్ ఆగస్టు 05 (ప్రజా జ్యోతి )** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గ్రామదేవతలైన పోచమ్మ, మైసమ్మ బోనాల మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తాజా మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ, భారీ బోనాల ఊరేగింపుతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మంగళ వాద్యాలు, భక్తుల జైజై ధ్వానాలతో ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కోస్గి యాదయ్య, పట్నం చంద్రయ్య, కోస్గి మహేష్, కోస్గి రవీందర్, కోస్గి మైసయ్య, కోస్గి రాజు, కోస్గి రవి, కోస్గి యాదయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ..!

నర్సప్పగూడలో పోతూ రాజుల విన్యాసాలు

సర్పంచ్ రాజేశ్వరి శ్రీనివాస్



**నందిగామ, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి)** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని సర్పంచ్ రాజేశ్వరి శ్రీనివాస్ అన్నారు. నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆషాడ మాసంలో పోచమ్మ మైసమ్మకు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నిర్వహించే రాష్ట్ర పండుగగా బోనాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. పోతురాజుల విన్యాసాలు, బ్యాండ్ భజంతులతో ఊరేగింపుగా వెళ్తారు. ఈ కార్యక్రమంలో బంటారం సుదర్శన్ గౌడ్, ఉప సర్పంచ్, సిద్దయ్య, నీరటి అశోక్, కొత్తూరు మెకానిక్ సంఘము అధ్యక్షుడు చందు జంగిలి, శేఖర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

# బోనాల ఏర్పాట్లపై అధికారుల నిర్లక్ష్యం!

బాపూజీనగర్ నల్ల పోచమ్మ ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్త

దుర్గంధంతో భక్తుల అవస్థలు



**బోయినపల్లి,ఆగస్టు05 (ప్రజాజ్యోతి):** రానున్న బోనాల మహోత్సవాల నేపథ్యంలో బాపూజీనగర్ శ్రీ నల్ల పోచమ్మ ఆలయం పరిసరాల్లో ఇప్పటికీ పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంపై భక్తులు, ఆలయ నిర్వాహకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బోనాల జాతరకు సమయం దగ్గరపడుతున్నా ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కంటోన్మెంట్ బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సికింద్రాబాద్ బోనాల అనంతరం అత్యంత వైభవంగా జరిగే బోయినపల్లి బోనాల జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్తను ఇప్పటికీ తొలగించకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెత్త తడిసి కుళ్లిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పండుగకు ముందు పారిశుద్ధ్య పనులు, చెత్త తొలగింపు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సిబ్బంది వంటి కనీస ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు ఇప్పటికీ స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర మతాల పండుగల సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని, అయితే హిందూ పండుగల విషయంలో మాత్రం అదే స్థాయి చొరవ కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసి, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# వన్ వార్డ్ ఎవరీ డే రోడామేస్త్రి నగర్‌లో స్థానిక సమస్యలను సమీక్షించిన కమిషనర్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** సైబరాబాద్ వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్,జోనల్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్,స్థానిక ప్రజాప్రతినిధులు,రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు,సంబంధిత శాఖల అధికారులతో కలిసి చింతల్ సర్కిల్‌లోని రోడామేస్త్రి నగర్ ప్రజలతో సమావేశమై పౌర సమస్యలు,స్థానిక అభివృద్ధి అవసరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు కొత్త రోడ్ల నిర్మాణం, రోడ్ల మరమ్మతులు,అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, కొత్త నాలా పనులు, వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, అలాగే నీటి సౌకర్యాలు, బోర్‌వెల్ల మరమ్మతులు వంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే కమ్యూనిటీ హాళు ్ల,శ్మశాన వాటికలు,పార్కులు,ఓపెన్ స్పేస్‌ల అభివృద్ధి,పారిశుధ్య సేవల మెరుగుదల, మురికివాడల్లో పందుల బెడద నివారణకు చర్యలు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ప్రజలు ప్రస్తావించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాధ్యమైన పనులకు అంచనాలు సిద్ధం చేయాలని,నిధుల లభ్యత ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని కమిషనర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, వార్డు స్థాయిలోని పౌర సమస్యలు,అభివృద్ధి అవసరాలపై ప్రాధాన్యతతో చర్యలు చేపడుతున్నారు.

# శిల్పారామములో ఘనంగా చేనేత దినోత్సవం



శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):మాదాపూర్ శిల్పారామం లో ఆఫీస్ అఫ్ ది కమీషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్, మినిస్ట్రీ అఫ్ టెక్స్టైల్స్,గోవేర్నఎన్టీ అఫ్ ఇండియా,వీవెర్స్ సొసైటీ హైదరాబాద్,శిల్పారామం సంయుక్త నిర్వహణలో 12 వ జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేత కళాకారుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆఫీస్ అఫ్ ది హెడ్ వీవర్స్ సర్వీస్ సెంటర్ అరుణ్ కుమార్,నటిమణులు అమల,జయలలిత,గాయత్రీ భార్గవి పద్మశ్రీ గజం గోవర్ధన్,పద్మశ్రీ గజం అంజయ్య,పద్మశ్రీ చింతకింది మల్లేశం ముఖ్య అతిధులుగా విచ్చేసి ఎత్నిక్ హాల్ లో ఏర్పాటు చేసిన చేనేత చీరలను, మొగ్గం చీర నేతలో కష్టాల వివరాలను తెలుసుకున్నారు. చేనేత ప్రాముఖ్యతను వివరించారు మనమందరం చేనేతను ప్రోత్సహించాలని కోరారు .

# సీనియర్ కాంగ్రెస్ నాయకులు చందు ముదిరాజ్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఆగస్టు



**5(వాయిస్ టుడే )** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పరిధిలోని సాయిబాబా నగర్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు చందు ముదిరాజ్ జన్మదినం సందర్భంగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా హన్మంతన్న చందు ముదిరాజ్ జన్మదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. వారు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికిరణ్ పటేల్, డీసీసీ కమిటీ సభ్యులు గోరికర్ కరణ్, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ గఫ్ఫార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింహా గౌడ్, రాజిరెడ్డి, రాంచందర్, నగేష్ రెడ్డి, అంజిరెడ్డి, రాజు చారి, హరి, యాసిన్, యూత్ కాంగ్రెస్ నాయకులు జానీ, అజ్జు, సన్నీ, శ్రీకాంత్, మాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీడిమెట్ల హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు కాలనీవాసుల విజ్ఞప్తి



**కుత్బుల్లాపూర్ ఆగష్టు 5(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీ వాసులు కలిసి, కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు అదేవిధంగా ఉషోదయ కాలనీ సంక్షేమ సంఘం ( వెల్ఫేర్ అసోసియేషన్) సభ్యులు కాలనీలోని పలు సమస్యలపై మర్యాదపూర్వకంగా కలిసి పరిష్కరించాలని కోరారు.. అనంతరం పలువురు తమ కుటుంబ శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆయనకు అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు...


# తల్లిపాలు శిశువుకు అమృతం లాంటివి

సర్పంచ్ సంతోష్ వెంకటేష్



**నందిగామ ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** తల్లిపాలు శిశువుకు అమృతం లాంటివి అని సర్పంచ్ బంగారు సంతోష్ ,వెంకటేష్ అన్నారు, మహబూబ్నగర్ జిల్లా, జడ్చర్ల నియోజకవర్గం, రాజాపూర్ మండలం ,తిరుమలాపూర్ గ్రామంలో సర్పంచ్ ఆధర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శిశువు పుట్టిన మొదటి గంటలోపే మురుగు పాలు పట్టించాలని అన్నారు ,ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు బిడ్డకు రోద రోగ ఏదో నిరోధ శక్తితో పాటు ఆరోగ్యంగా పెరుగుదలకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ నాగేంద్రమ్మ, ఉప సర్పంచ్ రామచందర్, అంగన్వాడి టీచర్, విజయ కుమారీ, ఏఎన్ఎం సుజాత వార్డు సభ్యులు, గుడ్ల సరూప, శ్రీశైలం ,అనిల్ గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేత రవీందర్ యాదవ్



**షాద్ నగర్ , ఆగస్టు 5 (ప్రజాజ్యోతి ):** కేశంపేట మండలం సంగెం గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాలకు హాజరైన రవీందర్ యాదవ్‌కు గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సత్కరించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజల్లో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే పండుగగా బోనాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేణుగోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ శకీల్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, సర్పంచ్ రామకృష్ణ, నాయకులు బల్వంత్ రెడ్డి, భగవాన్ రెడ్డి, జమాల్ ఖాన్, పుండరీకం గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, సలీం, అనిల్ గౌడ్, మన్సూర్, వంశీ, పురుషోత్తం తదితరులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా భాగస్వాములు కావాలి

పడమటి తండా సర్పంచ్ వాడ్యావత్ శంకర్ నాయక్



**తలకొండపల్లి ఆగస్టు05 (ప్రజాజోతి)** పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తలకొండపల్లి మండల పరిధిలోని పడమటి తండా గ్రామ సర్పంచ్ వాడ్యావత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు.గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి మొక్కలను బుధవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ప్రభుత్వం చేపడుతున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకున్నప్పుడే మన గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ మురమ్మ,వార్డు సభ్యులు కే.శ్రీను,ఆర్.శంకర్,పి.రవి,కే.హనుమంత్ తదితరులు పాల్గొని మొక్కలు పంపిణీ చేశారు.

# అల్వాల్ ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు.. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు




**అల్వాల్, ఆగస్టు 5 ప్రజా జ్యోతి** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది గత జూలై 31న లయోలా కళాశాల సమీపంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో జవహర్ నగర్‌కు చెందిన ఎ. రాకేష్ (21), షామీర్‌పేట్‌కు చెందిన కె. శ్రీనివాస్ (41), ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవినేష్ కుమార్ (30) మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. దీంతో వారిపై ట్రాఫిక్ పోలీసులు చలాన్లు నమోదు చేసి, ఆగస్టు 5న గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.విచారణ అనంతరం గౌరవ న్యాయమూర్తి జరిమానా విధించడంతో పాటు మద్యం సేవించి వాహనం నడిపిన నేరానికి సంబంధించి ఎ. రాకేష్‌కు రెండు రోజుల కారాగార శిక్ష, కె. శ్రీనివాస్ మరియు అవినేష్ కుమార్‌లకు ఆగస్టు 5 నుంచి ఆగస్టు 8 వరకు నాలుగు రోజుల కారాగార శిక్ష విధించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రజలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# సంగాయిపల్లి అంగన్వాడీలో తల్లిపాల వారోత్సవాలు

- తల్లిపాలు, ముర్రుపాల ప్రాముఖ్యతపై అవగాహన
- పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలని సూచన



**తలకొండపల్లి,ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి మండలంలోని సంగాయిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ...తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.ముర్రుపాలు పసుపు రంగులో ఉండి బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలను అందిస్తాయని సూచించారు.కాబట్టి ప్రతి తల్లి తప్పనిసరిగా ముర్రుపాలు ఇవ్వాలి అని వివరించారు.తల్లిపాల వల్ల కలిగే లాభాలు,సరైన పద్ధతిలో పాలివ్వడం,6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన ఆవశ్యకత గురించి గర్భిణీలు,బాలింతలు,తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,సెక్టార్ సూపర్వైజర్ తిరుమల,ప్రైమరీ స్కూల్ టీచర్,అంగన్వాడీ టీచర్,వార్డు సభ్యులుతో పాటు పెద్ద సంఖ్యలో గర్భిణీలు,బాలింతలు,తల్లులు పాల్గొన్నారు.

# కాలనీవాసుల విజ్ఞప్తికి స్పందన.. ధనంజయ్ ఎస్టేట్స్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టిన మైనంపల్లి హనుమంతరావు



**అల్వాల్, ఆగస్టు 5 ప్రజా జ్యోతి** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో యాప్రాల్ డివిజన్-189 పరిధిలోని కౌకూర్ ధనంజయ్ ఎస్టేట్స్ కాలనీలో బుధవారం పారిశుద్ధ్య, అభివృద్ధి పనులు చేపట్టారు.ఈ సందర్భంగా కాలనీ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించడంతో పాటు, మొదటి లేన్‌లో పేరుకుపోయిన సిల్ట్‌ను శుభ్రం చేశారు. అలాగే వీధి దీపాల వెలుతురుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించి, రాత్రి వేళల్లో రహదారి స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టారు.గ్రీన్‌వుడ్ రెసిడెన్సీ, ఫార్చ్యూన్ అవెన్యూ తదితర కాలనీలకు వెళ్లే ప్రజలు అధికంగా వినియోగించే ఈ రహదారిపై కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు పారిశుద్ధ్య, అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున తెలిపారు.ఈ సందర్భంగా పారిశుద్ధ్య విభాగం డీఈ సంతోష్, యూబీడీ విభాగం సూపర్‌వైజర్ రమేష్ సహకారంతో పనులు వేగంగా పూర్తయ్యాయని పేర్కొంటూ వారికి తుడిమెళ్ల మల్లికార్జున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాప్రాల్ డివిజన్ జనరల్ సెక్రటరీ శివరాజ్, అల్లి మల్లేష్, రాజ్‌కుమార్, అబ్దుల్ సలాం, శ్రీకాంత్, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థం దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు చర్యలు కోరిన జ్యోతి శ్రీనివాస్ గౌడ్





**అల్వాల్, ఆగస్టు 5 ప్రజా జ్యోతి** రానున్న ఆగస్టు 9న జరిగే బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని, భావానీనగర్ నుంచి అంబేద్కర్ నగర్ వరకు, అలాగే వీబీఆర్ గార్డెన్ నుంచి సిటిజన్ కాలనీ వరకు దెబ్బతిన్న రహదారులను అత్యవసరంగా మరమ్మతు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గొట్టిముక్కల జ్యోతి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి, ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు బోనాల సందర్భంగా వేలాదిమంది భక్తులు ఈ మార్గాల గుండా ప్రయాణించే అవకాశం ఉన్నందున, దెబ్బతిన్న రహదారులు ప్రమాదాలకు కారణమయ్యే పరిస్థితి ఉందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.వినతిని స్వీకరించిన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి, ఐఏఎస్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులైన అల్వాల్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లిలకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం ప్రతినిధి బృందం మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ను కూడా కలిసి సమస్యలను వివరించి, రహదారి మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టాలని కోరింది.ఈ కార్యక్రమంలో శారద, నర్సమ్మ, సులోచన, పద్మ, అనంతమ్మ, వంశీ ఎస్., శ్రీనివాస్ గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్‌డౌన్ తో ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన



**తలకొండపల్లి,ఆగస్టు 05 (ప్రజాజ్యోతి)** పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు పెన్‌డౌన్,షట్‌డౌన్‌తో చేస్తున్న నిరసన బుధవారం 6వ రోజుకు చేరింది.రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.....ఉపాధి హామీ పథకం అమలులో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు తగిన పే స్కేల్, గుర్తింపు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్థిక,సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.సమస్యలు పరిష్కారమయ్యే వరకు శాంతియుతంగా పెన్‌డౌన్,షట్‌డౌన్ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీవో కృష్ణ,ఈసీ కృష్ణ,టీఏలు లతరాణి,సువర్ణ,తానయ్య,కంప్యూటర్ ఆపరేటర్ జయరాం తో పాటు ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట




**షాద్‌నగర్, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి ):** సైబర్ నేరాల పట్ల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా ఉంటేనే ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని షాద్‌నగర్ ఎస్ఐ ప్రణయ్ కుమార్ అన్నారు. స్థానిక బి.ఏ.ఎం డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ వారియర్ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా 'గోల్డెన్ అవర్'లో ఫిర్యాదు చేస్తే మోసగాళ్ల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని, 24 గంటల్లోపు ఫిర్యాదు చేయడం అత్యంత కీలకమని వివరించారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఇతర ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి, సైబర్ నేరాల నుంచి ఎలా రక్షించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్‌కు బలమైన ఆరంభం



**హైదరాబాద్, ఆగస్టు 05 (ప్రజా జ్యోతి) :** ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ 2026-27 తొలి త్రైమాసికంలో 20 శాతం ఆదాయ వృద్ధితో రూ.2,597 కోట్లు, 30 శాతం నిర్వహణ లాభం వృద్ధితో రూ.576 కోట్లు నమోదు చేసిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ అజాద్ మూఫెన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండీ, గ్రూప్ సీఈఓ వరుణ్ ఖన్నా తోకలసి ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ - క్వాలిటీ కేర్ విలీనంతో 28 నగరాల్లో 10,800కు పైగా పడకలతో సేవలు అందిస్తున్న సంస్థ అన్నారు. భవిష్యత్తులో 15 వేల పడకలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ విలీనం కీలక మైలురాయి అని పేర్కొన్నారు. తొలి త్రైమాసికంలో సుమారు 20 లక్షల మంది రోగులకు సేవలు అందించామని తెలిపారు. ఆర్వోసీఈ 22.9 శాతానికి పెరగగా, కాసరగోడ్ ఆస్పత్రి తొమ్మిది నెలల్లోనే నిర్వహణ లాభం బ్రేక్‌ఈవెన్ సాధించిందని తెలిపారు.

# తలకొండపల్లిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా

- 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం,మినీ ట్రక్ సీజ్
- తలకొండపల్లి ఎస్‌హెచ్ఓ జానకిరామ్ రెడ్డి




**తలకొండపల్లి,ఆగస్టు 05 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా 20 క్వింటాళ్ల బియ్యం,ఒక మహేంద్ర మినీ ట్రక్‌ను సీజ్ చేసినట్లు తలకొండపల్లి సీఐ వి.జానకిరామ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆమనగల్లు మండలం మెడిగడ్డ తాండకు చెందిన నేనావత్ మణిపాల్ మరియు చుక్కపూర్ రేషన్ డీలర్ మల్లయ్య కలిసి పిడిఎస్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న అధికారులు బుధవారం స్పందించి పర్యవేక్షణలో భాగంగా అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ బియ్యాన్ని వాహనాన్ని సీజ్ చేయడం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.పోలీసులు దాడి చేసి,మినీ ట్రక్‌లోని 40 సంచుల్లో 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్ఓ జానకిరామ్ రెడ్డి పేర్కొన్నారు.అక్రమ రవాణాకు వాడిన వాహనాన్ని కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తలకొండపల్లి ఎస్ హెచ్ ఓ జానకిరామ్ రెడ్డి హెచ్చరించారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో తిరుగుబాటు తప్పదు

- సిఐటియు మండల కన్వీనర్ చందు నాయక్
- ఈనెల 10న జైల్ భరోను విజయవంతం చేయాలి
- సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ



**యాచారం, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో తిరుగుబాటు తప్పదని సిఐటియు మండల కన్వీనర్ చందు నాయక్ అన్నారు. సిఐటియు, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయు సంఘాల పిలుపుమేరకు ఈనెల 10న జరగనున్న జైల్ బరోను విజయవంతం చేయాలని మాల్ లో సిఐటియు ఆధ్వర్యంలో ఆ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం చందు నాయక్ మాట్లాడారు. అధికారంలోనున్న కేంద్ర ప్రభుత్వం చట్టాలను నాలుగు కోడ్ లుగా కుదించి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకాన్ని తొలగించి విబిజి రామ్ జి చట్టం ద్వారా పరోక్షంగా మతాన్ని ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే విత్తన సవరణ చట్టాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమవుతుందన్నారు. హక్కులను దేశ ప్రజల భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని కుల మతాలను రెచ్చగొట్టి పెంచి పోషిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటాలు తప్పవన్నారు. జైల్ బరోలో కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు

**జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవి: పూడూరి జితేందర్ రెడ్డి**

**పాత్రికేయుల ఐక్యతే ప్రెస్ క్లబ్‌కు బలం: వడ్డేపల్లి కిషోర్**

**ఉప్పల్,ఆగస్టు 5(ప్రజాజ్యోతి):** ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూడూరి జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నరసింహారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పూడూరి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి వాస్తవాలను చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు పనిచేస్తున్నారని కొనియాడారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మరింత అభివృద్ధి చెందాలని, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డికి ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ మాట్లాడుతూ పాత్రికేయుల ఐక్యతే ప్రెస్ క్లబ్‌కు బలమని, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఉప్పల్ ప్రెస్ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో




ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు ఇడపాక సురేష్, బోడ ప్రవీణ్, కశీదుకూరి ప్రశాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ధత్రపు దేవాకుమార్ ,యాకూబ్ పాషా, నెమ్మది వెంకన్న తదితరులు పాల్గొని నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ‘గాన్సిడ్ యూఎస్ఏ కాంగ్రెస్--2026’ అంతర్జాతీయ సదస్సు



**ఖైరతాబాద్, ఆగస్టు5 (ప్రజాజ్యోతి) :** జన్యుపరంగా సంక్రమించే రక్త సంబంధిత వ్యాధులపై ప్రపంచ స్థాయి నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురానున్న ‘గాన్సిడ్ యూఎస్ఏ కాంగ్రెస్--2026’ అంతర్జాతీయ సదస్సు అక్టోబర్ 23 నుంచి 25 వరకు హైదరాబాద్ లోని హెచ్ఐసీసీ, నోవోటెల్ లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కు చెందిన తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ స్థానిక భాగస్వామిగా వ్యవహరించనుందని సోమాజిగూడ లోని ఓ కార్యక్రమంలో తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్సీఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ సదస్సు నమోదు వివరాలను వెల్లడించారు. జన్యుపరంగా ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమించే రక్తవ్యాధుల చికిత్సలో వస్తున్న తాజా పరి శోధనలు, ఆధునిక వైద్య విధానాలు, సాంకేతిక పురోగతిపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి ప్రముఖ వైద్యనిపుణులు, పరిశోధకులు, ప్రయోగశాల శాస్త్రవేత్తలు, రోగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఔషధ పరిశ్రమ నిపుణులు, విధాన రూపకర్తలు, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల ప్రతినిధులు ఈ కాంగ్రెస్ లో పాల్గొని తమ అనుభవాలు, పరిశోధన ఫలితాలను పంచుకోనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సదస్సు ద్వారా జన్యుపర రక్త వ్యాధుల నివారణ, చికిత్సలో అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# దివీస్ ఫౌండేషన్, యునిసెఫ్ ఇండియాల భాగస్వామ్యం పునరుద్ధరణ

**సోమాజిగూడ,ఆగస్టు5(ప్రజాజ్యోతి) :** దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ మరియు యునిసెఫ్ ఇండియా సంస్థలు, వైకల్యాలను సమగ్రంగా పరిగణించే బాల్య వికాస కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ధరించాయని ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా నవజాత శిశువులు మరియు చిన్నారుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఈ భాగస్వామ్యం ఆగస్టు 2026 నుంచి జూలై 2029 వరకు అమలులో ఉండబోతుందన్నారు. ఈ ఒప్పందంపై దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ మేనేజింగ్ ట్రస్టీ నీలిమా ప్రసాద్ దివి మరియు యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింధియా మెక్కాఫ్రీ సంతకాలు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 నుంచి 2026 వరకు కొనసాగిన తొలి దశలో వైకల్యాలను సమగ్రంగా పరిగణించే బాల్య వికాస వ్యవస్థల నిర్మాణానికి బలమైన పునాది



పడింది. ఈ కాలంలో 20,000 మందికి పైగా క్షేత్రస్థాయి సిబ్బందికి, 50,000 మంది శిశు వైద్యులకు శిక్షణ అందించబడింది. అదేవిధంగా, 2,200 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ, సంరక్షణ సేవలు మరింత బలోపేతం చేయబడ్డాయన్నారు. క్లినికల్ సేవలు, శిక్షణ మరియు మార్గదర్శకత్వం అందించే సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు, జిల్లా స్థాయి సమాచారాలు, ప్రామాణిక క్లినికల్ మార్గదర్శకాలు రూపొందించి, ఎదుగుదలలో ఆలస్యాలను మరియు వైకల్యాలను ప్రారంభ దశలోనే గుర్తించి, పిల్లలకు సకాలంలో తగిన సేవలు అందించేలా వ్యవస్థలను బలోపేతం చేశారన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా మరింత మంది చిన్నారులను ప్రారంభ దశలోనే గుర్తించి, మరిన్ని కుటుంబాలకు సకాలంలో అవసరమైన సేవలు అందేలా చేయడం ద్వారా, ప్రతి చిన్నారి వారి పరిస్థితులు ఏవైనా సరే ఆరోగ్యంగా ఎదిగి, అభివృద్ధి చెందుతూ, తమ సంపూర్ణ సామర్థ్యాన్ని చేరుకునేలా దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ మరియు యునిసెఫ్ ఇండియా కలిసి పనిచేయనున్నాయన్నారు.

# పట్నం మున్సిపాలిటీలో మహిళా కౌన్సిలర్‌కు అవమానం: బీజేపీ

**చైర్మన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన**

**మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 5 ప్రజా జ్యోతి:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సర్వసభ సమావేశంలో మహిళా ప్రజాప్రతినిధికి జరిగిన అవమానకర ఘటనపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల రెండో తారీఖున జరిగిన సర్వసభ సమావేశంలో కౌన్సిలర్ భానుప్రియ తన వార్డుకు నిధులు కేటాయించడం లేదని ప్రతిపాదనను తిరస్కరించారని నేలపై కూర్చొని నిరసన తెలిపిన క్రమంలో, మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, మహిళా కౌన్సిలర్ ను సమావేశంలో కించపరిచే విధంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చైర్మన్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నాయిని సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా కౌన్సిలర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. మహిళా ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత మున్సిపల్ చైర్మన్ పై ఉందని, వారిని కించపరచడం ద్వారా మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వార్డు అభివృద్ధి నిధుల కేటాయింపులో కూడా వివక్ష చూపుతున్నారని ఆరోపించిన ఆయన, ప్రజాప్రతినిధులందరికీ సమాన అవకాశాలు కల్పించి, అన్ని వార్డుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అధికార పార్టీకి చెందిన వార్డులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ, ప్రతిపక్ష కౌన్సిలర్లను నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మహిళా కౌన్సిలర్ భానుప్రియ మాట్లాడుతూ... తనపై జరిగిన వ్యవహారం వ్యక్తిగత అవమానం మాత్రమే కాదని, ప్రజలు ఇచ్చిన ప్రజాప్రతినిధి హోదాకు జరిగిన అవమానమని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా ప్రజా సమస్యలు ప్రస్తావించే పరిస్థితి ఉండాలని, బెదిరింపులు లేదా అవమానాలు సహించబోమని స్పష్టం చేశారు.

నిరసన అనంతరం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా కౌన్సిలర్‌ను అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, చైర్మన్ సుదర్శన్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వార్డు అభివృద్ధి నిధుల కేటాయింపులో పారదర్శకత పాటిస్తూ అన్ని వార్డులకు సమాన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, స్థానిక కార్యకర్తలు, కౌన్సిలర్లు మరియు పలువురు ప్రజలు పాల్గొని మహిళా ప్రజాప్రతినిధులకు గౌరవం కల్పించాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై త్వరలో తగిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.

# తల్లిపాలు శిశువుకు తొలి రక్షణ కవచం: మొయినాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్

**చిలుకూరు వార్డు కార్యాలయంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ**

**గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించిన మున్సిపల్ ప్రజాప్రతినిధులు**



**మొయినాబాద్ :ఆగస్టు 5(ప్రజా జ్యోతి )** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ వార్డు కార్యాలయం ఆవరణలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమం కౌన్సిలర్లు శ్రీమతి సదువు శ్రీలత రామచందర్, కళ్లెం జగపతి బాబు, శ్రీమతి గునుగుర్తి శిరీష కిరణ్, శ్రీమతి గౌర అనసూయ నరసింహ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గరుగు రాజు మాట్లాడుతూ....తల్లి పాలు శిశువుకు సంపూర్ణ ఆహారమని, పుట్టిన వెంటనే తల్లి పాలను అందించడం ద్వారా శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని పేర్కొన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు పూర్తిగా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పోషకాహారంతో పాటు తల్లి పాలను కొనసాగించాలని సూచించారు. తల్లి పాల ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు సదువు రామచందర్, గునుగుర్తి కిరణ్, గౌర యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొని తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# మృతుని కుటుంబానికి ఉప్పల ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేత



**తలకొండపల్లి,ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కట్టుమల పాండయ్య అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత,మిషన్ భగీరథ మాజీ వైస్ ప్రెసిడెంట్ ఉప్పల వెంకటేష్ బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి తమ ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 3వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్,మాజీ సర్పంచ్ లలిత జోతయ్య,ఉప సర్పంచ్ నూకం కోటిశ్వర్ ముదిరాజ్,వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్,కనుక వెంకటయ్య,పి. కుమార్, దశరథ్,సాయ్యులు, కృష్ణయ్య,నర్సింహ,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో భద్రత పెంపొందించడానికే సైబర్ జాగృతి దివస్

**సిఐ సత్యనారాయణ**

**మోసానికి గురైతే 1930 హెల్ప్ లైన్ కు ఫోన్ చేయాలి**

**సైబర్ మోసాల పై విద్యార్థులకు అవగాహన**




**యాచారం, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగృతి దివస్ నిర్వహించడం ద్వారా విద్యార్థులు, టీచర్లు, ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యమని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పిఎస్ సిఐ సత్యనారాయణ చెప్పారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా మీర్‌ఖాన్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్ కాల్ ద్వారా మెసేజ్ ల ద్వారా ఓటీపీలు, ఆధార్ కార్డు వివరాలు అడుగుతారని వాటిపట్ల స్పందించవద్దని చెప్పారు. తమ సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవడానికి బలమైన పాస్ వార్డులు వినియోగించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు తప్పుడు వార్తలు నమ్మవద్దన్నారు. అధికారిక వర్గాల ద్వారా నిజా నిజాలను తెలుసుకోవాలని చెప్పారు. స్పష్టత లేని మెసేజ్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులమంటూ కాల్స్ చేస్తూనే భయపెట్టి డబ్బులు వసూలు చేస్తారని జాగ్రత్తలు వహించాలన్నారు. అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చే సందేశాలు కాల్స్ లింకులను నమ్మవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డీసీపీ ట్రాఫిక్ శేషాద్రిని రెడ్డి ఐపీఎస్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ తో కలిసి మియాపూర్ జంక్షన్‌ను సందర్శిన






**శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** ఈ సందర్భంగా డీసీపీ పాదచారులతో నేరుగా మాట్లాడి, జీబ్రా క్రాసింగ్,పాదచారుల సిగ్నల్ మరియు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ రహదారిని సురక్షితంగా దాటాలని అవగాహన కల్పించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడం వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం మరియు ఇతర తీవ్ర పరిణామాల గురించి వివరించి,ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అనంతరం మియాపూర్ జంక్షన్‌లో కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన ముందస్తు పనులను, అలాగే ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా చేపట్టిన అదనపు (ఎక్స్‌ట్రా) లేన్ ట్రయల్ రన్ ను పరిశీలించారు. నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా,అదే సమయంలో అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ట్రాఫిక్‌ను సమర్ధవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అలాగే అల్విన్ జంక్షన్ వద్ద ఉన్న ఫ్రీ లెఫ్ట్ సౌకర్యాన్ని పరిశీలించి, వాహనదారులకు స్పష్టమైన అవగాహన కల్పించే విధంగా ఫ్రీ లిఫ్ట్ ఎహెడ్, ఫ్రీ లెఫ్ట్ ఫైన్ ఫర్ వయోలేషన్ అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

అదేవిధంగా,మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ఫ్రీ లెఫ్ట్ మార్గాలను అడ్డుకునే వాహనదారులపై మోటార్ వెహికిల్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేసి నేరుగా వెళ్లేందుకు ప్రయత్నించే వాహనాలను అనుమతించకుండా,ఫ్రీ లెఫ్ట్ మార్గం ద్వారానే వెళ్లేలా చేసి, తదుపరి యూ–టర్న్ వరకు ప్రయాణించే విధంగా ట్రాఫిక్‌ను నియంత్రించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణ మరియు ప్రజల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు.

# రాగన్నగూడలో వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ప్రారంభించిన బూడిద రాంరెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 05(ప్రజాజ్యోతి)** గ్రామీణ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాగన్నగూడ జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకులు బూడిద రాంరెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఎలిమినేటి నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛమైన తాగునీరు ఎంతో అవసరమని, ఆ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం ఎలిమినేటి నరసింహారెడ్డి మాట్లాడుతూ, సమాజాభివృద్ధికి బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు ఇతర సంస్థలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు ఉపయోగపడే ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# ఫార్మా జీవో రద్దయ్యేలా అధికారిక జీవోను జారీ చేయాలి

- ఫార్మా, ఫ్యూచర్ సిటీ. ప్రాజెక్టులపై జ్యూరీ నివేదిక
- నివేదికను విడుదల చేసిన జ్యూరీ కమిటీ సభ్యులు
- గత నెల 5న ఫార్మా బాధిత గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రజల, రైతుల డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలి
- ఇవ్వని భూములను భూ సేకరణ నుంచి మినహాయించాలి
- చదును యంత్రాలను గ్రామాలలో నుంచి తొలగించాలి
- పోలీసు, రెవెన్యూ, టీజీఐఐసి సిబ్బంది ప్రవేశాన్ని నిషేధించాలి
- కురుమిద్దలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి



**యాచారం, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో జరుగుతున్న పరిస్థితులపై గత నెల 5న ఫార్మాసిటీ బాధిత గ్రామమైన తాడిపర్తిలో టీపీజేఏసీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నివేదికను బుధవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో జ్యూరీ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ప్రజల, రైతుల అభిప్రాయ సేకరణ మేరకు ఈ నివేదికను విడుదల చేస్తున్నట్లు జ్యూరీ కమిటీ సభ్యులు చెప్పారు. ఫార్మాసిటీ ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో ప్రజల, రైతుల డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించి అమలు చేయాలన్నారు. భూములు ఇవ్వడానికి అంగీకరించని రైతుల భూములు భూ సేకరణ నుంచి పూర్తిగా మినహాయించాలన్నారు. భూములు ఇవ్వని రైతుల పేర్లను వెంటనే భూ భారతి ఆన్లైన్ లో పునరుద్ధరించాలన్నారు. నిషేధిత జాబితాలో (సెక్షన్ 22 ఏ) నుంచి భూములను తొలగించి రిజిస్ట్రేషన్ హక్కులను పునరుద్ధరించాలన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఇప్పటికే సేకరించిన భూములను స్వాధీనం చేసుకోకూడదని భూమిని చదును చేసే యంత్రాలను గ్రామాలలో నుంచి తొలగించాలన్నారు. మరోవైపు కురుమిద్దలో గ్రీన్ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. రైతులను భయాందోళనకు గురి చేస్తున్న పోలీసు, రెవెన్యూ, టీజీఐఐసి సిబ్బంది ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించాలని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఫార్మాసిటీ జీవోను పూర్తిగా రద్దు చేసేలా ప్రభుత్వం అధికారిక జీవోను జారీ చేయాలని ఇందుకోసం కేవలం మౌఖిక హామీలు ఇవ్వొద్దని ఇతర పలు అంశాలను నివేదికలో వెల్లడించారు. రైతుల ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉండేలా నివేదికను వెల్లడించినట్లు పేర్కొన్నారు

# సెరికల్చర్ రిసోర్స్ సెంటర్‌ను సందర్శించిన స్లేట్ హై స్కూల్ విద్యార్థులు

- పట్టుపురుగుల పెంపకం,ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు
- గ్రామీణ ఉపాధికి సెరికల్చర్ ఎంతో దోహద పడుతుంది
- రంగారెడ్డి జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధ్యక్షులు శక్రు నాయక్




**తలకొండపల్లి,ఆగస్టు 05 (ప్రజాజ్యోతి)** నాగర్ కర్నూలు జిల్లా మిడ్జిల్ మండలంలోని స్లేట్ హై స్కూల్ విద్యార్థులు విద్యా పర్యటనలో భాగంగా రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని భాగంగా కోరింతకుంట గ్రామంలోని సెరికల్చర్ రిసోర్స్ సెంటర్‌ను బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ హెడ్ శక్రు నాయక్ విద్యార్థులకు పట్టుపురుగుల జీవిత చరిత్ర,పట్టు పురుగుల పెంపకం,మల్బరీ సాగు పద్ధతులు,వాటి వల్ల కలిగే లాభాలు,ఉపాధి అవకాశాలు,పట్టు ఉత్పత్తి విధానాల గురించి సులభంగా,ఆసక్తికరంగా వివరించారు.విద్యార్థులు ఆయన వివరణను శ్రద్ధగా ఆలకించారు.పట్టు పరిశ్రమకు సంబంధించిన అనేక సందేహాలను అడిగి తెలుసుకుని ప్రత్యక్ష అవగాహన పొందారు.పట్టుపురుగుల పెంపకం చిన్న పెట్టుబడితోనే అధిక లాభాలు ఇచ్చే వృత్తి.ఒక ఎకరా మల్బరీలో సంవత్సరానికి 5 నుండి 6 పంటలు తీసుకోవచ్చని,మల్బరీ సాగుతో పాటు పట్టుపురుగులను శాస్త్రీయంగా పెంచితే 45 రోజుల్లోనే ఆదాయం వస్తుందని శక్రు నాయక్ పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలు,యువతకు ఇది మంచి ఉపాధి అవకాశమని వివరించారు.విద్యార్థులకు చక్కగా వివరించిన శక్రు నాయక్ కి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్ ఆనంద్,అస్లాం,రైతులు గ్రామ సర్పంచ్ రవీందర్,మల్లేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాంపూర్ ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

**తలకొండపల్లి,ఆగస్టు 06 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో వెలిసి ప్రసిద్ధి గాంచిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలక మండలిగా ఎన్నికైన చైర్మన్ మరియు డైరెక్టర్ల సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం నేడు రాంపూర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా జరుగనుంది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విచ్చేయనున్నారు.ఈ సందర్భంగా నూతన పాలక మండలి చైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ....ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టిన మున్సిపాలిటీ

మల్కాపూర్, శాంతినగర్ ప్రాంతాల్లో పనుల పరిశీలన -- ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు: చైర్‌పర్సన్ రజిత వెంకటేష్



**పరిగి, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** పరిగి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు మల్కాపూర్, 16వ వార్డు శాంతినగర్ పోస్టాఫీస్ సమీపంలో వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లకు బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, కమిషనర్ కె. మల్లేష్ ఆయా వార్డులను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వారం రోజులుగా మున్సిపల్ పరిధిలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రోడ్ల మరమ్మతులతో పాటు నీటి నిల్వలు, రాకపోకల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ భాస్కర్, స్థానిక నాయకులు ఇలియాజ్, అబ్దుల్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధికి కృషి చేస్తా

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




**బంట్వారం ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు, ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్పెషలాఫీసర్ జిల్లా పరిషత్ సీఈవో సుధీర్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్వసభ సమావేశంలో ముందుగా వివిధ శాఖల అధికారులు గ్రామాలలోని అభివృద్ధి ప్రణాళికలు చేసిన పనులు పెండింగ్ పనులు వంటి అంశాలను సభలో చదివి వినిపించారు, ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ,,,, గ్రామాలలోని సమస్యలపై అధికారులను వెంటనే సందర్శించి వాటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్పంచులు తీసుకువచ్చినటువంటి సమస్యలపై వెంటనే పార్టీలకతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని అన్నారు. సభలో చర్చించినటువంటి అంశాలను తిరిగి 45 రోజుల తర్వాత మళ్లీ సమావేశంలో ఈ అంశాలను పరిష్కారమయ్యాయా లేదా అని తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో సుదీర్, డిఎస్పి అంజయ్య,ఎంపీడీవో రాములు, తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీఓ నాగరాజ్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ సవరణ పై సమావేశం

చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకల్ పల్లి చంద్రశేఖర్



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి)** ఆగస్టు 05 : వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని మరికల్ గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమంపై చుట్టుపక్కల గ్రామాలైన సర్పంచులతో మరియు మరికల్ స్థానిక సర్పంచ్ ఇందిర సత్యకుమార్ కన్మన్ కల్వ,కృష్ణవేణి రాజు,కొత్తపల్లి,రఘు కిష్టంపల్లి,రాధికా కేశవులు బంగ్రంపల్లి చెన్నయ్య గ్రామాల సర్పంచులు.కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎస్ఐఆర్ పై ఓటర్ సవరణ వేగవంతం చేయాలని సమావేశాన్ని నిర్వహించబడింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ఆగస్టు 10వ తేదీ ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమానికి చివరి తేదీ కావడంతో,ప్రతి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు,ఓటరు వివరాల సవరణలు,కొత్త ఓటర్ల నమోదు తదితర ప్రక్రియలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి,ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమాన్ని గడువులోగా 100 శాతం విజయవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.ప్రజలకు అవగాహన కల్పించి,అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది.


Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

# ఎన్నో ప్రభుత్వాలు మారినా... పుర్సంపల్లి పాఠశాల తలరాత మాత్రం మారలేదు

శిథిలావస్థలో పాఠశాల భవనం -- భయంతోనే విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులు

చౌడాపూర్ మండల పరిధిలోని పుర్సంపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారింది.ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా,ఈ పాఠశాల దుస్థితి మాత్రం మారడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలం రావడంతో పాఠశాల పైకప్పు నుంచి వర్షపు నీరు నేరుగా తరగతి గదుల్లోకి కారుతోంది.గోడలకు భారీ పగుళ్లు ఏర్పడటంతో భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.దీంతో విద్యార్థులు ప్రతిరోజూ భయభయంతో తరగతులకు హాజరవుతుండగా,వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.చదువు కోసం పంపితే.పిల్లలు సురక్షితంగా తిరిగి వస్తారా అనే ఆందోళన ప్రతి తల్లిదండ్రిని వెంటాడుతోంది.చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ పరిస్థితిని చూసి గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి పుర్సంపల్లి పాఠశాల తలరాతను మార్చి,కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించి చిన్నారులకు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని గ్రామస్తులు,విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.ప్రమాదం



జరగకముందే చర్యలు తీసుకోవాలి అని గ్రామస్తులు ప్రభుత్వాన్ని,సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# శిథిలావస్థలో మొగుల్లపల్లి ప్రాథమిక పాఠశాల..

ప్రాణాలను పణంగా పెట్టి విద్యాభ్యాసం
ప్రమాదకర భవనానికి బదులుగా గ్రామస్తుల ఇళ్లలోనే తరగతులు.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం







చౌడాపూర్ మండల పరిధిలోని మొగుల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదంలో ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత విషమించగా,పైకప్పు నుంచి వర్షపు నీరు తరగతి గదుల్లోకి కారుతుండటంతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడింది.ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయుడు,చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవనంలో తరగతులు నిర్వహించకుండా,పాఠశాలకు సమీపంలోని గ్రామస్తుల ఇళ్లలోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ పాఠశాలలో కాకుండా ఇతరుల ఇళ్లలో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడం స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.గ్రామస్తులు ఈ సమస్యను గ్రామసభల్లో ఎన్నోసార్లు స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా,ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోతున్నారు.అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏదైనా ప్రమాదం జరిగాక స్పందించడం కాదు.. ప్రమాదం జరగకముందే స్పందించాలి.సంబంధిత విద్యాశాఖ అధికారులు,జిల్లా యంత్రాంగం వెంటనే పాఠశాలను పరిశీలించి,కొత్త భవనం నిర్మించేందుకు లేదా సురక్షిత ప్రత్యామ్నాయ భవనంలో తరగతులు నిర్వహించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు,విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎన్నో ప్రభుత్వాలు మారుతున్న... బంగారంపల్లి పాఠశాల ఇక మారదా

వర్షాల ప్రభావంతో ప్రమాదకరంగా మారిన పాఠశాల భవనం
ఒకే గదిలో ఇరుకిరుకుగా విద్యార్థులు,బయటి వరండలో బోధన





చౌడాపూర్ మండల పరిధిలోని బంగారంపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం వర్షాల ప్రభావంతో పూర్తిగా ప్రమాదకర స్థితికి చేరుకుంది.భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఐదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులను ఒకే గదిలో ఇరుకిరుకుగా కూర్చోబెట్టి పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో తరగతి గది లోపల కూర్చోవడం కూడా కష్టంగా మారింది.గోడల్లో పగుళ్లు పెరగడంతో భవనం మరింత బలహీనంగా మారిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.దీంతో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయుడు తరగతులను పాఠశాల బయటి వరండలో నిర్వహిస్తున్నారు.ఒకే గదిలో అన్ని తరగతుల విద్యార్థులు ఇరుకిరుకుగా కూర్చోవడం,వర్షం పడినప్పుడు వరండలోకి మారి పాఠాలు చెప్పాల్సి రావడం వల్ల చదువుపై ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చిన్నారులు భయంతోనే పాఠశాలకు వస్తున్నారని వారు చెబుతున్నారు.పాఠశాల భవనం మరమ్మతులు లేదా కొత్త భవనం నిర్మాణం కోసం అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు,విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.పిల్లల ప్రాణాలకు ప్రమాదం లేకుండా సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నవాంద్గి సొసైటీ బ్యాంకులో గోల్డ్ లోన్ పై అనుమానాలు తెర

-గోల్డ్ లేకుండానే రుణాలు ఇచ్చారని ఫిర్యాదు విచారణ
-ఎలాంటి అవకతవకలు జరగలేదని లక్ష్మీనారాయణపూర్ సొసైటీ బ్యాంక్ మేనేజర్ మమత



**బషీరాబాద్ ఆగస్టు 5 ప్రజా జ్యోతి** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని నవాంద్గి సొసైటీ బ్యాంకు గోల్డ్ లోన్ లో మంజూరులో అవకతవకలు జరిగాయని గోల్డ్ లేకుండానే రూపాయలు మూడు లక్షల 50 వేలు రుణాలు మంజూరు చేశారని హెచ్ డి సి సి బ్యాంకు కార్యనిర్వాక అధికారికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు మేరకు లక్ష్మీనారాయణపూర్ సొసైటీ బ్యాంకు మేనేజర్ మమత బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై అన్ని రికార్డులను పరిశీలించగా గోల్డ్ నిల్వలు రుణాలకు అనుగుణంగానే ఉన్నాయని ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. సిస్టం ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంతో ఆరోజు గోల్డ్ లోన్ మాన్యువల్ విధానంలో నమోదు చేసి మరుసటి రోజు సిస్టంలో అప్లోడ్ చేసినట్లు తెలిపారు. గోల్డ్ లోన్ విషయంలో రైతులు లేదా ఇతర ఖాతాదారులు ఎలాంటి అనుమానాలకు గురికావలసిన అవసరం లేదని గోల్డ్ లోన్ సేవలు యధావిధిగా సాగుతాయని అర్హులైన వారు రుణాలు పొందవచ్చు అని మేనేజర్ మమత తెలిపారు. నవాంద్గి సొసైటీ గోల్డ్ లోన్ ఇవ్వడంలో మంచి పేరుగాంచింది కాబట్టి దీనిపైన ఎవరు అనుమానాలు పెట్టుకోవదని మేనేజర్ సూచించారు.

# ఘనంగా ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన
-మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి,
-ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి
-కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రోహిత్ మహారాజ్
-సొసైటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి



**బషీరాబాద్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రోహిత్ మహారాజ్ , సొసైటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి,ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషలతో నిండు నూరేళ్లు జీవించి తాండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ఉంచుతున్నారు. ఎన్నో నిధులు తీసుకువచ్చి రహదారులనువేయించడం జరుగుతుందిఆయురారోగ్యాలతో ఉండి ఇంకా అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాం అన్నారు. అనంతరం,మాజీ మార్కెట్ కమిటీ, వైస్ చైర్మన్ మాణిక్ రెడ్డి, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ నర్సింలు గౌడ్ ,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాము నాయక్, శివ, కాశప్ప, పవన్ ఠాకూర్, బిచ్చిరెడ్డి, కాలీద్ శామప్ప,సురేష్ , సాయిలు గౌడ్, మునీర్ సంగమేశ్వర్, దీపక్, రాములు, అంజిలప్ప, దన్ సింగ్, బాలకృష్ణ, నర్సింలు, రాఘవేందర్, సాబన్న, రాము నాయక్, నర్సింలు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఒకరికొకరు కేక్ తినిపించుకొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇట్టి జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డిఅమెరికా పర్యటనలో ఉన్నందున వారికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రోహిత్ మహారాజ్ చిరావాన్నిలో వాట్సప్ కాల్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు వేడుకల్లో పాల్గొన్న నాయకులందరూ కూడా శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# ఘనంగా ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

యాలాల్ మండలంలోని 39 గ్రామాల్లో కేక్ కటింగ్ ప్రత్యేక పూజలు,అన్నదానం
ప్రజల ప్రేమే నాయకుడికి నిజమైన బలం" మండల అధ్యక్షుడు కే. మహిపాల్ యాదవ్



**యాలాల్ ఆగస్టు 5 ప్రజా జ్యోతి** తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు యాలాల్ మండలవ్యాప్తంగా ఘనంగా కాంగ్రెస్ పార్టీ యాలాల్ మండల అధ్యక్షుడు కే.మహిపాల్ ఆధ్వర్యంలో మండలంలోని 39 గ్రామాల్లో ప్రత్యేక కేక్ కటింగ్ కార్యక్రమాలు,ఫ్లెక్సీల ఏర్పాటు,శుభాకాంక్షల కార్యక్రమాలు నిర్వహించడంతో మండలమంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. జుంటుపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయంలో గిరిజాపురం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆయురారోగ్యాలు,దీర్ఘాయుష్షు, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండల అధ్యక్షుడు కే.మహిపాల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కుమారుడు బుయ్యాని శివకుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు.కాంగ్రెస్ నాయకులు,సీనియర్ నాయకులు పి ఐ సి ఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డిశ్రీధర్ అనిల్ కుమార్ గుర్రత్ జోషి భీమయ్య హనుమంతు ముదిరాజ్ పవన్ కుమార్ రెడ్డి అమర్నాథ్ రెడ్డి కలల చంద్ర శేఖర్ గౌడ్ విజయకుమార్ రమేష్ గౌడ్ మల్లప్ప మల్లయ్య రాజు రఘురాం రెడ్డి రాఘవేందర్ రెడ్డి ఉప్పరి వెంకటయ్య తదితరులు

# ఓ మహిళపై దాడి చేసిన క్రైమ్ పార్టీ పోలీసులు

-రూ 20 రూపాయలు ఇవ్వమనందుకే దాడి!
-మేం పోలీసులం మాకే అడుగుతావా






-తాండూరు పట్టణంలో అర్ధరాత్రి ఘటన!

**తాండూరు ఆగస్టు 5 ప్రజా జ్యోతి** :- వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణం సాయిపూరు రోడ్డు మార్గంలోని యాదిరెడ్డి చౌక్‌లో (ఆదిత్య హాస్పిటల్) ముందు ఓ కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్న ఓ మహిళపై ఇద్దరూ క్రైమ్ పార్టీ పోలీసులు అంటూ విచక్షణ రహితంగా దాడి చేశారు.మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆ దుకాణం వద్దకు వెళ్లిన క్రైమ్ పార్టీ పోలీసులు ఒక బీర్ కావాలని రూ 200 రూపాయలు ఇచ్చి తీసుకున్నారు. మరో రూ 20 రూపాయలు అదనంగా ఇవ్వమన్నందుకు ఆ మహిళ ముఖంపై విచక్షణ రహితంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఓ పోలీసు ఇద్దరు పోలీస్ సిబ్బంది క్రైమ్ డిపార్ట్మెంట్ అని చెప్పి మరీ దాడి చేసినట్లు ఆ మహిళా ఆందోళన వ్యక్తం చేస్తుంది. అక్కడ జీవనోపాధి కోసం చిన్నపాటి కిరాణా దుకాణం నిర్వాహకుల మధ్య జరిగిన వాగ్వాదం తో ఆ మహిళపై దాడి చేసే స్థాయికి వెళ్లిందంటే ఎంత భయంకరంగా ఉందో అర్థమవుతుంది. అప్పటికే తప్ప తాగిన ఆ పోలీసులు ఇద్దరు మహిళా అని చూడకుండా జరిగిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.ఇట్టి విషయంపై తనకు న్యాయం చేయాలని సదరు మహిళ వీరమణి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత ( క్రైమ్ పార్టీ పోలీసుల )పోలీసులపై ఫిర్యాదు కూడ చేశారు. దీంతో ఆ మహిళ రాజీ చేసుకోవాలని కాళ్ళు మొక్కిన పోలీస్ సిబ్బంది తీరుపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫ్రెండ్లీ పోలీసుల మంటూ అమాయక ప్రజలపై దాడులకు పాల్పడటం ఏమిటనే కోణంలో చర్చించుకుంటున్నారు. ఆ మహిళతో రాజీ కుదిర్చుకుంటారా క్రైమ్ పార్టీ పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారా అనే దానిపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల కోసం చివరి అవకాశం



**కొడంగల్ ఆగస్టు 5 ప్రజా జ్యోతి న్యూస్:**కోడంగల్ నియోజకవర్గ కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా డిగ్రీ చివరి ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ గురువారం నేటి నుండి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ 06/08/2026 నుండి 11/08/2026 వరకు రిజిస్ట్రేషన్స్ మరియు 06/08/2026 నుండి12/08/2026 వరకు వెబ్ ఆప్షన్స్ ఎంపిక ఉంటుంది. దోస్త్ చివరి దశలో చేరిన విద్యార్థులకు కూడా స్కాలర్షిప్ మరియు ఫీజు రీఇంబర్స్ మెంట్ వర్తిస్తుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. బి. ఎ, బి. కామ్, కంప్యూటర్ అప్లికేషన్స్ బి.ఎస్సీ బి.జడ్.సి , ఎం. పి. సి , ఎం. పి. సి.ఎస్ మరియు బి.ఎస్సీ హెల్త్ కేర్ కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ఒడిస్సా సీఎం రేసులో ధర్మేంద్ర

**భువనేశ్వర్ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, దేశ విద్యావిధానంలో లోపాలపై ఇటీవల కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెల రోజులు ఆందోళన చేసింది. మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసింది. చివరకు మంత్రి ప్రధాని వారించినా వినకుండా పదవికి రాజీనామా చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజానీమా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు ఏం చేయబోతున్నారు అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఒడిశా నుంచి కొన్ని సంకేతాలు వస్తున్నాయి. రాజీనామా తర్వాత వచ్చిన ప్రతిస్పందనలు భిన్నంగా ఉన్నప్పటికీ, ఇటీవల భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన గ్రాండ్ వెల్కమ్ రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్రను గురించి కొత్త చర్చ మొదలైంది.నైతిక బాధ్యత తీసుకుని పదవి వదిలినట్లు చెప్పుకుంటున్నా, ఈ నిర్ణయం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని కొందరు భావించారు. కానీ ఒడిశాలో మాత్రం విషయం వేరేలా కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన స్వాగతం కేవలం ఆచారం కాదు. అనేక మంది రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావడం ఆయనకు పార్టీలో ఇంకా బలమైన ఆధారం ఉందని స్పష్టం చేస్తోంది. రాజకీయ వర్గాలు దీన్ని ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశంగా చూస్తున్నాయి.ప్రధాన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని స్థానిక స్థాయిలో చర్చలు మొదలైంది. ఇది కొందరు స్థానిక నేతల్లో కలవరాన్ని కలిగిస్తోంది. 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ చర్చలు తలెత్తడం సహజం. అయితే వెంటనే మార్పు జరగడం సులభం కాదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత నాయకత్వం, సామాజిక సమీకరణలు, యువత అభిప్రాయం వంటి అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.ఇప్పటికీ అధికారికంగా ఏమీ స్పష్టం కాలేదు. ఆయనను కొంతకాలం విశ్రాంతి తీసుకునేలా చేయడం, పార్టీ సంస్థాగత పనుల్లో నియమించడం లేదా రాష్ట్ర రాజకీయాల్లో క్రమంగా పెద్ద పాత్ర ఇవ్వడం వంటి ఎంపికలు ముందున్నాయి. ఒడిశా బీజేపీలో ఆయనకు ఉన్న ప్రభావం, ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయం కేంద్ర అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనేది రాష్ట్రంలో అధికార సమీకరణలను, అంతర్గత సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఢిల్లీలో ఒక అధ్యాయం ముగిసినట్లు కనిపించినా, ఒడిశాలో మరో అధ్యాయం తెరవడానికి దారి తీస్తోంది. ఎయిర్‌పోర్టు స్వాగతం ఆ సంకేతాలను బలపరుస్తోంది. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఎంత వరకు కీలకమవుతారు, సీఎం పాత్ర వైపు అడుగులు పడతాయా అనేది కేవలం సమయం, అధిష్ఠానం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

## యాక్టివ్ పాలిటిక్స్‌లోకి నల్లారి

**హైదరాబాద్ :** ఏపీ బీజేపీలో చాలామంది నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు బాగానే గెలిచారు. 8 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి విజయం సాధించారు. మరో ముగ్గురు ఎంపీలు సైతం ఉన్నారు. ఒక రాష్ట్ర మంత్రి తో పాటు కేంద్ర మంత్రి కూడా ఉన్నారు.. ఎందరు ఉన్న బిజెపి పెద్దగా సౌండ్ చేయడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి లైన్ లోకి వచ్చారు. ప్రెస్ మీట్ పెట్టి రాష్ట్రాల మధ్య జలవివాదం గురించి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. జలవివాదాలు విషయంలో ఎటువంటి మొహమాటలకు పోవద్దని.. పక్క రాష్ట్రాలతో చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరం అనుకుంటే పోరాటం చేయాలని కూడా పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సాహేతుకంగా జరగలేదని.. అప్పట్లోనే జల పంపకాలు చేపడుతూనే వివాదాలు పరిష్కరించుంటే ఇంతవరకు పరిస్థితి వచ్చి ఉండేది కాదు అని అభిప్రాయపడ్డారు కిరణ్ కుమార్ రెడ్డి.ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్వచ్ఛందంగా తప్పుకోవడంతో.. స్పీకర్ గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆయన హయాంలోనే రాష్ట్ర విభజన జరిగింది. దానిని తీవ్రంగా వ్యతిరేకించారు కిరణ్ కుమార్ రెడ్డి. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. సొంతంగా సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అది అంతగా వర్కౌట్ కాలేదు. చివరకు బిజెపిలోకి వచ్చి ఆ పార్టీ తరఫున మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మీడియా ముందుకు వచ్చి రాష్ట్ర విభజన సమస్యలు, జలవివాదాలు గురించి ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రస్తుతం గోదావరి తో పాటు కృష్ణా జలాలకు సంబంధించి వివాదాలు

## బీసీ-ఎస్‌సీ-ఎస్‌టీ ఐక్యతతోనే అధికార మార్పు

**– డా. విశారదన్ మహారాజ్ పిలుపు**




**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 5( ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గుప్తాస్ ఛాయ ఇన్ బంకెట్ హాల్‌లో బుధవారం నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా ఆవిర్భావ సదస్సు ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ చైర్మన్ డా. విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా విమర్శించారు. వికారాబాద్ జిల్లాలో దోపిడి కులాల ఆధిపత్యం కొనసాగుతోందని ఆరోపిస్తూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరుగుతున్న రాజకీయ అన్యాయాలను వివరించారు. జిల్లాలో పెరుగుతున్న ఆత్మహత్యల ఘటనలను ప్రస్తావిస్తూ, సమాజంలోని అన్ని సమస్యలకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన కోసం సమష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు తులసిగారి రవీందర్, రాజ్ కమల్ రెడపాక, గుడిసె బాలయ్య ముదిరాజ్, మాజీ జెడ్పీటీసీ సంతోష్ రాజు, సీఐ రామస్వామి ముదిరాజ్, డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ డా. జగన్ మోహన్, రిటైర్డ్ ఎంఆర్ఓ దేవానంద్ రాజలింగం, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## సొసైటీ చైర్మన్ పదవిపై విభేదాల ప్రభావమా?

**బషీరాబాద్ మండలంలో వేర్వేరుగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు**





**బషీరాబాద్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం వేర్వేరు వేదికల్లో నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమం జరగగా, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మరో కార్యక్రమం నిర్వహించారు. రెండు కార్యక్రమాల్లోనూ నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఇటీవల సొసైటీ చైర్మన్ పదవి ఎంపిక సందర్భంగా ఏర్పడిన విభేదాల నేపథ్యంలోనే నాయకులు వేర్వేరుగా జన్మదిన వేడుకలు నిర్వహించారని మండల రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

## ఘనంగా ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, -సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్**





**బషీరాబాద్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. ఆయురారోగ్యాలతో నిండి ప్రజలకు మరింత సేవ చేసేలా దేవుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందర్ నాయక్, మహిళా మండల అధ్యక్షురాలు శాంతి గోపాల్ ,వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శంకరప్ప , సర్పంచ్ నరేష్, డైరెక్టర్ మహేందర్ రెడ్డి, నర్సింలు, శ్రీనివాసరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మాణిక్ రావ్, భీమప్ప, శ్రీకాంత్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గొట్టిగ కాలాన్‌లో ఘనంగా ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**బషీరాబాద్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం గొట్టిగ కాలాన్ గ్రామంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మాణిక్ రావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, రాములు, నీలి వెంకటప్ప, ద్యావరి నరసింహులు, కొత్తూరు నరసింహులు, కొత్తూరు మైపాల్, ద్యావర గోపాల్, కిష్టప్ప, బోయిని అనురాధ శాంతమ్మకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మార్కెట్ పనులు నిలిచిపోయాయి

**బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం ఆపాలి**



**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 5( ప్రజా జ్యోతి):** వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసేందుకు ప్రస్తుత పాలక మండలి కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో అసంపూర్తిగా మిగిలిన పనులన్నీ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తామని చెప్పి అక్కడి షెడ్డులు, మరుగుదొడ్లు, నీటి సదుపాయాలను పూర్తిగా తొలగించి రైతులను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. నిర్మాణం మొదటి దశలోనే పనులు నిలిచిపోవడంతో రైతులు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్పీకర్ ప్రసాద్ కుమార్ మార్గదర్శకత్వంలో మినరల్ వాటర్ ప్లాంట్, కొత్త మరుగుదొడ్లు, బోర్‌వెల్, కూరగాయల విక్రయానికి కవర్ షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, అవి ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఈ పనులను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అనవసరంగా కాంగ్రెస్ ప్రభుత్వం, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. అభివృద్ధిని అడ్డుకునే శక్తులుగా బీఆర్ఎస్ మిగిలిపోతే, అభివృద్ధి సాధకులుగా కాంగ్రెస్ నాయకులు చరిత్రలో నిలుస్తారని స్పష్టం చేశారు.

# ఆగస్టు 11న 'రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ కొత్త దేశం



**న్యూఢిల్లీ :** బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత “రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్” పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించు కుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది. బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత “రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్” పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది. బలూచ్ జాతీయవాదులు 1947 ఆగస్టు 11న కలాత్ రాజ్యం (ఆధునిక బలూచిస్తాన్‌లోని ముఖ్య భాగం) స్వతంత్రంగా ప్రకటించబడిందని చెబుతారు. బ్రిటిష్ వైదొలగడం సమయంలో కలాత్ ఖాన్‌తో స్టాండ్‌స్టిల్ ఒప్పందం కుదిరి, దానిని స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించినట్లు కొన్ని నివేదికలు ఉన్నాయి. అయితే 1948 మార్చిలో పాకిస్తాన్ సైన్యం జోక్యం చేసుకుని కలాత్‌ను విలీనం చేసింది. బలూచ్ వైపు ఇది బలవంతపు విలీనం అని, పాకిస్తాన్ వైపు ఇది చట్టబద్ధమైన అనుసంధానం అని వాదనలు ఉన్నాయి. అయితే ఈ చారిత్రక అసంతృప్తి ఆధారంగా 1948 నుంచి అనేక తిరుగుబాటు దశలు జరిగాయి. ప్రస్తుత ఉద్యమం దాని కొనసాగింపుగా కనిపిస్తుంది.2026 జూలైలో మిర్ యార్ బలోచ్ వంటి నాయకులు “రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్” పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించారు. వారు జాతీయ జెండా, గీతం, కరెన్సీ (బలోచి ఫాలస్) ప్రవేశపెట్టినట్లు, 85 శాతం భూభాగంపై నియంత్రణ ఉన్నట్లు, స్వంత పరిపాలనా వ్యవస్థ ఉన్నట్లు దావా చేశారు. ఆగస్టు 3, 2026న ఆగస్టు 11ను స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటించి, ప్రపంచవ్యాప్తంగా జెండా ఎగురవేసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇది 1947 చారిత్రక తేదీపై ఆధారపడి ఉంది. అయితే ఈ దావాలు స్వతంత్రంగా ధ్రువీకరించబడలేదు. ఏ దేశం లేదా అంతర్జాతీయ సంస్థ ఈ “రిపబ్లిక్”ను గుర్తించలేదు. బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్తాన్ ప్రావిన్స్‌గానే కొనసాగుతోంది.బలూచ్ వైపు ప్రధాన ఆరోపణ సహజ వనరులు (గ్యాస్, ఖనిజాలు, గ్వాదర్ పోర్ట్) స్థానికులకు ప్రయోజనం లేకుండా చైనా?పాక్ ఎకనామిక్ కారిడార్ ద్వారా బయటకు వెళ్తున్నాయని, యువతపై అణచివేత, మహిళలు మాయం కావడం వంటి మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటోంది. బీఎల్ఏ వంటి సమూహాలు ఈ కారణాలతో పోరాటం చేస్తున్నాయని చెబుతాయి. ఈ ఆరోపణలు హ్యూమన్ రైట్స్ సంస్థలు, కొన్ని అంతర్జాతీయ నివేదికలలో కూడా ప్రస్తావించబడ్డాయి. అదే సమయంలో పాకిస్తాన్ ఈ సమూహాలను ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తుంది. బీఎల్ఏను కొన్ని దేశాలు విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాయి.బీఎల్ఏ, ఇతర సమూహాలు సైనిక స్థావరాలు, మౌలిక వసతులపై దాడులు చేస్తూ ఉన్నాయి. 2026లో కోఆర్డినేటెడ్ దాడులు జరిగాయి, కానీ పాకిస్తాన్ సైన్యం కౌంటర్?ఆపరేషన్లు కొనసాగిస్తోంది. ప్రావిన్స్‌పై పూర్తి నియంత్రణ బలూచ్ సమూహాల చేతుల్లో ఉందన్న దావా స్వతంత్ర మూలాల ద్వారా నిర్ధారించబడలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం ఇప్పటికీ అధికారిక నిర్వహణలో ఉన్నాయి. స్వాతంత్ర్య ప్రకటన చట్టపరంగా రాజకీయ వ్యక్తీకరణగా ఉండవచ్చు, కానీ ప్రభావవంతమైన ప్రభుత్వం, విదేశీ సంబంధాల సామర్థ్యం రాష్ట్రంగా నిలబడటానికి అవసరమైన అంశాలు లేవు.బలూచిస్తాన్ సమస్య చారిత్రక అసంతృప్తి, వనరుల పంపిణీ అసమానత, మానవ హక్కుల ఆరోపణలు, సాయుధ పోరాటాల మిశ్రమం. స్వయంప్రకటిత స్వాతంత్ర్యం గుర్తింపు పొందకపోయినా, ఉద్యమం కొనసాగుతోంది. శాంతియుత రాజకీయ పరిష్కారం, స్థానిక అభివృద్ధి, మానవ హక్కుల రక్షణ లేకుండా ఈ సంఘర్షణ మరింత సంక్లిష్టం కావచ్చు. పాకిస్తాన్ ఎలా స్పందిస్తుందో, అంతర్జాతీయ సమాజం ఎలా చూస్తుందో ఆగస్టు 11 తర్వాత స్పష్టం అవుతుంది.